శనివారం
23-09-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 93
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఆధునిక బానిసత్వాన్ని అంగీకరించం

గ్రీస్‌లో కార్మికలోకం కదంతొక్కింది. కన్జర్వేటివ్ న్యూ డెమొక్రసీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక బిల్లును తిరస్కరించింది. తక్షణ ఉపసంహరణకు డిమాండ్ చేసింది. ఆధునిక బానిసత్వాన్ని తేవాలని ప్రభుత్వం చూస్తోందని దుయ్యబట్టింది.

2 లో

చంద్రబాబు అరెస్ట్‌పై

రెండోరోజూ రగడ

- టీడీపీ వాయిదా తీర్మానం తిరస్కృతి
- స్పీకర్ పోడియం చుట్టుముట్టి ఆందోళన
- ప్రతిపక్ష సభ్యులపై సస్పెన్షన్ వేటు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అసెంబ్లీ సమావేశాల రెండోరోజు కూడా రగడ చోటుచేసుకుంది. చంద్రబాబు అక్రమ అరెస్ట్‌పై ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించడంతో టీడీపీ సభ్యులు చర్చకు పట్టుపడుతూ ఆందోళన చేపట్టారు. స్పీకర్ పోడియంను చుట్టుముట్టారు. సైకో పాలన పోవాలని, చంద్రబాబుపై తప్పుడు కేసు ఎత్తివేయాలని, అరాచకాలకు అడ్డా ఏపీ వంటి నినాదాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ నేపథ్యంలో శాసనసభ వ్యవహారాల శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి జోక్యం చేసుకుని రోజూ సభకు అంతరాయం కలిగించడం సరికాదన్నారు. టీడీపీ సభ్యులు కోరుతున్న విధంగా స్కిల్ డెవలప్‌మెంట్ కేసుపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని, కానీ సరైన విధానంలో రావాలని సూచించారు. నిరసన తెలియజేసే హక్కును కాదనమని, కానీ వ్యక్తిగతంగా విమర్శిస్తూ నినాదాలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకు లాగా తాము కూడా నిందిస్తూ నినాదాలు చేయగలమని, కానీ తాము సభా సంప్రదాయాలు పాటిస్తున్నామన్నారు. తమ సహనాన్ని అలుసుగా తీసుకోవద్దని హెచ్చరించారు. టీడీపీ సభ్యులు మరింత బిగ్గరగా నినాదాలు చేశారు. నందమూరి బాలకృష్ణ, గద్దె రామమోహన్ తదితరులు విజిల్స్ తెచ్చి ఊదారు. దీంతో మంత్రి అంబటి

- మిగతా 2 లో

సీఐడీ కస్టడీకి చంద్రబాబు



- రెండు రోజులకు అనుమతి
- ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు
- న్యాయవాది సమక్షంలో రాజమండ్రి జైలులో విచారణ
- ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు
- క్వాష్ పిటిషన్ తిరస్కరించిన హైకోర్టు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబును రెండు రోజుల సీఐడీ కస్టడీకి అనుమతిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. సీఐడీ ఐదు రోజులు కోరగా కోర్టు మాత్రం రెండురోజులకే అనుమతిచ్చింది. చంద్రబాబు క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసిన తర్వాత ఏసీబీ కోర్టు మధ్యాహ్నం ఈ ఉత్తర్వులు ఇచ్చింది. రెండు రోజులుగా సీఐడీ కస్టడీ, క్వాష్ పిటిషన్లపై ఉత్కంఠ కొనసాగింది. రాజమహేంద్రవరం జైలులోనే చంద్రబాబును విచారణ చేయాలని న్యాయమూర్తి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విచారణకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. విచారణ సందర్భంగా ప్రతి గంటకూ 5 నిముషాలు విరామం ఇవ్వాలని, భోజనానికి మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు విరామం ఇవ్వాలని, అలాగే న్యాయవాదుల సమక్షంలోనే చంద్రబాబు విచారణ జరగాలని షరతు విధించారు. విచారణ మొత్తాన్ని వీడియో తీయాలని సూచించారు. విచారణకు సంబంధించిన వివరాలు, ఫొటోలు మీడియాకు వెల్లడించకూడదని కోర్టు హెచ్చరించింది. చంద్రబాబు వయసు, ఆరోగ్య రీత్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. కస్టడీ ముగిసిన అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట హాజరుపరచాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో నిధులు ఎటు మళ్లించారనే దానిపై విచారించాల్సి ఉందని ప్రభుత్వ న్యాయవాదులు కోర్టులో వాదించారు. ఈ కేసులో ఇంకా ఎవరెవరు ఉన్నారనేది వెలుగులోకి వస్తాయని ఏసీబీ కోర్టుకు సీఐడీ తరుపు న్యాయవాదులు విన్నవించారు. సీఐడీ తరపు న్యాయవాదుల వాదనతో న్యాయమూర్తి ఏకీభవించడంతో చంద్రబాబును రెండు రోజుల కస్టడీకి అప్పగిస్తూ ఏసీబీ కోర్టు తీర్పు వెలువరించింది.

రేపటి వరకు రిమాండ్ పొడిగింపు

చంద్రబాబు 14 రోజుల రిమాండ్ శుక్రవారంతో ముగియడంతో కోర్టు తదుపరి ఆదేశాల కోసం రాజమహేంద్రవరం జైలు అధికారులు విజయవాడ ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఎదుట వీడియో కాన్ఫరెన్స్ విధానంలో చంద్రబాబుని హాజరుపరిచారు. ఈ సందర్భంగా రాజమండ్రి జైలు అధికారులు రిమాండ్‌లో మీకేమైనా ఇబ్బందులు కలిగించారా అని చంద్రబాబును జడ్జి ప్రశ్నించారు. ఎల్లుండి వరకు జ్యుడిషియల్ కస్టడీలోనే ఉంటారని తెలిపారు. మిమ్మల్ని కస్టడీకి ఇవ్వాలని సీఐడీ అడుగుతోందని తెలియజేయగా, తనను అకారణంగా జైల్లో పెట్టారని, తన బాధ, ఆవేదనంతా అదేనని చంద్రబాబు చెప్పారు. తన గురించి దేశంలో, రాష్ట్రంలో అందరికీ తెలుసునని చెప్పారు. దీనికి జడ్జి స్పందిస్తూ మీరు చెప్పిన విషయాలు నోట్ చేసుకున్నానని తెలిపారు. రిమాండ్‌ను శిక్షగా భావించవద్దని, ఇది

- మిగతా 2 లో

అసెంబ్లీని బహిష్కరిస్తున్నాం

- స్పీకర్ ఏకపక్ష వైఖరికి నిరసన
- మంత్రులతో గంటల తరబడి మాట్లాడిస్తున్నారు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్పీకర్ తమ్మినేని సీతారాం ఏకపక్ష వైఖరిని నిరసిస్తూ శాసనసభ వర్షాకాల సమావేశాలను పూర్తిగా బహిష్కరిస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు శుక్రవారం ప్రకటించారు. రెండోరోజు కూడా టీడీపీ సభ్యులను స్పీకర్ సస్పెండ్ చేశారు. అనంతరం అచ్చెన్నాయుడు మీడియాకు తమ

- మిగతా 2 లో

కార్మికవర్గం ఐక్యతతో మోదీ సర్కార్‌ను గద్దె దించుదాం

- కార్మిక హక్కుల రక్షణకు ఉద్యమాలు ఉధృతం
- బీజేపీ విధానాలతో అశాంతి, ఆర్థిక సంక్షోభం
- ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్ సమావేశాల్లో అమర్‌జిత్ కౌర్ పిలుపు

(తిరుప్పూర్ నుంచి డి.సోమసుందర్) కోట్లాది శ్రామికుల జీవనానికి విపత్కరంగానూ, భారతీయ సామాజిక జీవితానికి హానికరంగానూ తయారైన బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి కార్మికవర్గం గట్టిగా పూనుకోవాలని ఏఐటీయూసీ జాతీయ ప్రధానకార్యదర్శి అమర్‌జిత్ కౌర్ పిలుపునిచ్చారు. తమిళనాడులోని వస్త్రపారిశ్రామిక

- మిగతా 2 లో

అంతా గందరగోళం

- రెండు షెడ్యూళ్లు ఒకేసారి
- పీజీ వైద్య విద్యార్థుల అయోమయం
- ఏకకాలంలో నీట్ పీజీ, వైఎస్ఆర్ హెల్త్ వర్సిటీ షెడ్యూల్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పీజీ వైద్య సీట్ల భర్తీకి సంబంధించి డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ, ఆల్ ఇండియా నీట్ పీజీ రిజిస్ట్రేషన్ల కోసం ఏకకాలంలో షెడ్యూల్ జారీ చేయడంతో అభ్యర్థులకు దిక్కుతోచడం లేదు. పీజీ మెడికల్ రెండో విడత కౌన్సెలింగ్ (2023-24 విద్యాసంవత్సరం) రిజిస్ట్రేషన్లకు ఈనెల 20 నుంచి 23 వరకు గడువు కల్పిస్తూ డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ షెడ్యూలు జారీ చేసింది. అదేసమయంలో నీట్ పీజీ (మూడో విడత) కౌన్సెలింగ్ కోసం ఈనెల 22 నుంచి 25 వరకు రిజిస్ట్రేషన్లకు షెడ్యూలు జారీజేశారు. రాష్ట్రంలోని వివిధ పీజీ వైద్య కళాశాలల్లో సీట్ల భర్తీకి డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ వర్సిటీ ద్వారాను, దేశంలోని వివిధ పీజీ వైద్య కళాశాలల్లో సీట్ల భర్తీకి ఆల్ ఇండియా నీట్ మెడికల్ కౌన్సెలింగ్ ద్వారా వేర్వేరుగా రిజిస్ట్రేషన్లు స్వీకరిస్తారు. ఈ రెండు షెడ్యూళ్లు దాదాపు ఒకే సమయంలో ఉండటం వల్ల పీజీ వైద్య సీట్ల కోసం రిజిస్ట్రేషన్లు చేసుకునే అభ్యర్థులకు అసౌకర్యం కలుగుతోంది. నేషనల్ మెడికల్ కౌన్సెలింగ్‌లో అర్హత పొందిన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకుని, వారి ర్యాంకును అప్‌లోడ్ చేస్తారు. వారిందరికీ ఈనెల 28న ర్యాంకుల ఆధారంగా ఫలితాలు ప్రకటిస్తారు. నీట్ పీజీ కోటాలో సీట్లు రాని వారంతా ఏపీలోని డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని పీజీ వైద్య కళాశాలల్లో రిజిస్ట్రేషన్లు నమోదు

- మిగతా 2 లో

బీజేపీ ఎంపీ అహంకారం

- బీఎస్‌పీ ఎంపీ డానిష్ అలీపై అనుచిత వ్యాఖ్యలు
- సస్పెండ్ చేయాలని విపక్షాల డిమాండ్
- స్పీకర్ ఆగ్రహం... బీజేపీ షోకాజ్ నోటీసు

న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల వేళ ఢిల్లీకి చెందిన బీజేపీ ఎంపీ రమేశ్ బిధూరీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. రమేశ్ బిధూరిపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేయగా...సొంతపార్టీ సైతం షోకాజు నోటీసు జారీ చేసింది. బహుజన సమాజ్

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఇద్దాం, పాపం వాళ్లు నీకంటే పేదరికంలో బాధపడుతున్నారుగా!

చంద్రుడిపై విక్రమ్, ప్రజ్ఞాన్ పునరుద్ధరణ

నేటికి వాయిదా

బెంగళూరు: చంద్రుడిపై స్లీప్ మోడ్‌లో ఉన్న చంద్రయాన్-3కి సంబంధించిన విక్రమ్ ల్యాండర్, రోవర్ ప్రజ్ఞాన్‌ను పునరుద్ధరించే ప్రణాళికలను శనివారానికి వాయిదా వేసినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తెలిపింది. తొలుత శుక్రవారం సాయంత్రం ల్యాండర్, రోవర్‌ను తిరిగి యాక్టివేట్ చేయాలని భావించినట్లు స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ డైరెక్టర్ నీలేష్ దేశాయ్ తెలిపారు. అయితే కొన్ని కారణాల వల్ల దీనిని సెప్టెంబరు 23న చేపడతామని అన్నారు. కాగా, ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 విజయవంతమైన సంగతి తెలిసిందే. ఆగస్టు 23న చంద్రుడి దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్ సాఫ్ట్ ల్యాండ్ అయ్యింది. దీంతో అక్కడ అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. ల్యాండర్ నుంచి చంద్రుడి

ఉపరితలం పైకి దిగిన రోవర్ సుమారు 105 మీటర్ల దూరం వరకు కదిలింది. మరోవైపు చంద్రుడిపై లూనార్ నైట్ ప్రారంభం కావడంతో సెప్టెంబరు 2న రోవర్‌ను, 4న ల్యాండర్‌ను స్లీప్ మోడ్‌లో ఇస్రో ఉంచింది. అయితే శుక్రవారం నుంచి చంద్రుడిపై తిరిగి

- మిగతా 2 లో

వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలకు

చురుకుగా ఏర్పాట్లు

- సాగు భూమి, సామాజిక న్యాయం, ఉపాధి సాధనే లక్ష్యం
- కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సు అమలు చేయాలి
- సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విల్సన్, శేఖర్

విశాలాంధ్ర బ్యూరో- బాపట్ల: ఈ నెల 25 నుంచి 27 వరకు బాపట్లలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మిక సంఘం 22వ రాష్ట్ర మహాసభలకు చురుకుగా సన్నాహాలు జరుగుతున్నాయని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్,ఆవుల శేఖర్ తెలిపారు. బాపట్ల పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర మహాసభల షెడ్యూల్‌ని విడుదల చేశారు. రాష్ట్రంలోని పేదలకు సాగుభూమి,ఉపాధి, సామాజిక న్యాయం దక్కేంత వరకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాలు చేస్తుందని వెల్లడించారు. విల్సన్ మాట్లాడుతూ 25వ తేదీన సాయంత్రం మూడు గంటలకు బాపట్ల- గుంటూరు రోడ్డులోని మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం నుంచి సాగుభూములు, ఉపాధి, సామాజిక న్యాయం సాధన నినాదంతో కూలిదండు మహాప్రదర్శన సాగుతుందన్నారు. 26,27 తేదీల్లో పట్టణంలోని

- మిగతా 2 లో

ఆధునిక బానిసత్వాన్ని అంగీకరించం

- గ్రీస్‌లో కదం తొక్కిన కార్మికలోకం
- కార్మిక వ్యతిరేక బిల్లుకు నిరసనగా జాతీయ సమ్మె - కేకేఈ మద్దతు

ఏథెన్స్: గ్రీస్‌లో కార్మికలోకం కదంతొక్కింది. కన్జర్వేటివ్ న్యూ డెమొక్రసీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక బిల్లును తిరస్కరించింది. తక్షణ ఉపసంహరణకు డిమాండ్ చేసింది. ఆధునిక బానిసత్వాన్ని తేవాలని ప్రభుత్వం చూస్తోందని దుయ్యబట్టింది. దీనిని ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని తేల్చి చెప్పింది. ఓ వైపు వరదలు, కార్చిచ్చులతో ప్రజలు అల్లాడిపోతుంటే బానిసత్వం ముగ్గులోకి కార్మికులను దింపేందుకు కన్జర్వేటివ్ ప్రభుత్వం వ్యూహాలు రచిస్తోందని కార్మిక నేతలు ఉద్ఘాటించారు. బానిసత్వ సంకెళ్లు వేస్తామంటే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని లేకుంటే తీవ్ర పరిణామాలు తప్పబోవని హెచ్చరించారు. బిల్లుకు నిరసనగా సమ్మెబాట పట్టారు. దేశవ్యాప్తంగా భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. వేలాది మంది రోడ్లపైకొచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. బిల్లు ఉపసంహరణకు డిమాండ్ చేశారు. ఆల్ వర్కర్స్ మిలిటెంట్ ఫ్రంట్ (పీఏఎంఈ)తో పాటు వేర్వేరు రంగాల కార్మిక సంఘాల అధ్వర్యంలో రాజధాని ఏథెన్స్‌లోని సింటాగ్మా స్క్వేర్ వద్ద ధర్నా జరిగింది. థెస్సాలోనికి, లారిస్సా, పట్రాస్, లోన్నినా, కోర్ఫూ, కటేరిని వంటి ప్రముఖ నగరాల్లో భారీ ప్రదర్శనలు, నిరసనలు జరిగాయి. కార్మికులకు గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) సంఘీభావం తెలిపింది. గ్రీస్ కమూనిస్ట్ యూత్ (కేఎన్ఈ) కూడా మద్దతు ప్రకటించాయి. సమ్మెలో పాల్గొన్న కేకేఈ ప్రధాన కార్యదర్శి దిమిట్రిస్ కౌట్‌సోంపస్ మాట్లాడుతూ 'కార్మిక-ట్రేడ్ యూనియన్ ఉద్యమం దేశాన్ని కుదిపివేస్తోంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన పెద్దఎత్తున జరుగుతోంది. గ్రీక్ కార్మికుల సమాఖ్య (జీఎస్ఈఈ) నాయకత్వం రాజీ పడింది కాబట్టే కార్మిక వ్యతిరేక బిల్లు పార్లమెంటును చేరుకోగలిగింది. ఈ బిల్లుపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది' అని వ్యాఖ్యానించారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా సమ్మెకు, ఆందోళనలకు పిలుపు ఇవ్వనందుకుగాను గ్రీక్ కార్మికుల సమాఖ్య (జీఎస్ఈఈ)పై కార్మిక సంఘాల నాయకులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లు ప్రకారం కార్మికులు వారంలో ఆరు రోజులు పనిచేయాల్సి ఉంటుంది. రోజుకు ఎనిమిది గంటలకు బదులు 13 గంటలు పనిచేయాలి. ఉద్యోగంలో చేరిన ఏడాదిలోపు ఎలాంటి కారణం చూపకుండా, వేతనం ఇవ్వకుండా ఉద్యోగిని తొలగించవచ్చు. ఉద్యోగులు సమ్మెలు చేస్తే వారికి జరిమానాలు విధించవచ్చు. అలాగే ఆరునెలలు జైలుకు పంపేందుకు వీలు ఉంటుంది. ఇటువంటి బిల్లును తక్షణమే రద్దు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి.

ప్రభుత్వోద్యోగుల్లా హోదా, వేతనాలివ్వాలి

నేపాల్‌లో టీచర్ల డిమాండ్

దేశవ్యాప్త సమ్మె

29 వేల స్కూళ్లు బంద్

ఖాట్మండు: నేపాల్‌లో టీచర్లు సమ్మెబాట పట్టారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన విద్యా సంస్కరణ బిల్లుకు వ్యతిరేకంగా రాజధాని ఖాట్మండులో లక్షల మంది ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ క్రమంలో 29వేల స్కూళ్లు మూసివేశారు. బుధవారం నుంచి టీచర్ల సమ్మె జరుగుతోంది. స్కూల్ విద్యా బిల్లును టీచర్లు తిరస్కరించారు.

మరోవైపు శాసనంలో సవరణలపై ప్రభుత్వంతో టీచర్ల సంఘాల ప్రతినిధులు చర్చలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను స్థానిక యంత్రాంగానికి అప్పగిస్తే తమ హోదా తగ్గుతుందని టీచర్లు వెల్లడించారు. అలాగే తాత్కాలిక టీచర్లు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. శుక్రవారం పార్లమెంటు భవనం నుంచి ప్రభుత్వ మంత్రిత్వశాఖలకు వెళ్లే ప్రధాన మార్గాన్ని టీచర్లు దిగ్బంధించారు. దీంతో వందల మంది రయట్ పోలీసులను ఆ ప్రాంతంలో మోహరించారు. పార్లమెంటుకు వెళ్లే రోడ్డులో ముళ్లకంచెలు వేశారు. ఈ క్రమంలో పోలీసులతో టీచర్లు ఘర్షణకు దిగారు.

దీంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. టీచర్లను కేంద్రప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని, రాజకీయ ప్రభావిత స్థానిక యంత్రాంగాల నియంత్రణలోకి పంపరాదని, ప్రభుత్వ ఉద్యోగులతో సమాన వేతనాలు, హోదా, వసతులు కల్పించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని నేపాల్ ప్రభుత్వాన్ని టీచర్లు హెచ్చరించారు.

విశాలాంధ్ర ప్రపంచం

మన బంధం మరింత బలోపేతం

సిరియా అధ్యక్షుడితో భేటీలో జిన్‌పింగ్

హాంగ్‌ఝౌ: చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ శుక్రవారం సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌తో చైనాలోని జేజియాంగ్ ప్రావిన్స్‌లోని హాంగ్‌ఝౌలో భేటీ అయ్యారు. ఇద్దరు నాయకులు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. చైనా-సిరియా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించుకున్నారు. ఇది తమ ద్వైపాక్షిక బంధానికి ఒక మైలురాయిగా నిలుస్తుందని జిన్‌పింగ్ చెప్పారు. అంతర్జాతీయ పరిస్థితుల్లో మార్పుల అవరోధాలను అధిగమించి సవాళ్లను తట్టుకొని తమ మైత్రి నిలిచిందని, రెండు దేశాల స్నేహ బంధం మరింత బలోపేతమైందని చైనా అధ్యక్షుడు అన్నారు. కాగా, శనివారం నుంచి 19వ ఏషియన్ గేమ్స్ ప్రారంభం కానున్నాయి. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా అసద్ హాజరవుతారు. రెండు దశాబ్దాల తర్వాత ఆయన మొదటిసారి చైనాలో పర్యటించారు. అసద్‌కు విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. తమ దేశ పున:నిర్మాణానికి చైనా నుంచి ఆర్థిక సాయాన్ని సిరియా కోరుకుంటోంది. అయితే అసద్ పర్యటనతో చైనా-సిరియా బంధం మెరుగు కాగలదని చైనా విదేశాంగశాఖ తెలిపింది. పరస్పర రాజకీయ విశ్వాసం, అనేక రంగాల్లో సహకారం పెరుగుతుందని ఆకాంక్షించింది.

బీజేపీ ఎంపీ అహంకారం

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ ఎంపీ డానిష్ అలీపై లోక్‌సభలో రమేశ్ చేసిన వ్యాఖ్యలను విపక్షాలు తీవ్రంగా ఖండించాయి. ఆయనను సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ సహా ఇతర ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సైతం రమేశ్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేయగా.. బీజేపీ ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. గురువారం చంద్రయాన్-3 విజయంపై చర్చ సందర్భంగా బిధూరీ ఎంపీ డానిష్ అలీని అభ్యంతరకర పదజాలంతో దూషించారు. ఈ వ్యాఖ్యలను ఆ తర్వాత రికార్డుల నుంచి తొలగించారు. భిధూరీ వ్యాఖ్యల పట్ల విపక్షాలు అభ్యంతరం వ్యక్తంచేశాయి. డానిష్ అలీ గురించి బిధూరీ చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమని, ఇలాంటి పదజాలం ఇంతకుముందెన్నడూ వినలేదని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. పార్లమెంట్ కొత్త భవనం ఇలాంటి మాటలతో ప్రారంభం కావడం బాధాకరమన్నారు. బిధూరీ వ్యాఖ్యలు బీజేపీ ఉద్దేశాన్ని తెలియజేస్తోందని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓబీసీలను, ముస్లింలను అవమానించడం బీజేపీ సంస్కృతిలో భాగమని తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రా ఆరోపించారు. ముస్లిం ఎంపీపై బీజేపీ ఎంపీ భిధూరీ చేసిన వ్యాఖ్యలను ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఖండించారు. ఇలాంటి వ్యాఖ్యల ద్వారా దేశంలోని గొప్ప పార్లమెంటరీ సంప్రదాయాలకు తిలోదకాలిస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని ఆదేశానుసారమే పార్లమెంటులో ప్రతిపక్ష ఎంపీపై బీజేపీ సభ్యుడు అసభ్య పదజాలం వినియోగించారని విమర్శించారు.కాగా, రమేశ్ బిధూరిని తక్షణమే అరెస్టు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. 'విద్వేష ప్రసంగాలను క్షమించేది లేదు. రమేశ్ భిధూరీని తక్షణమే అరెస్టు చేయాలి. బీఎస్‌పీ ఎంపీపై రమేశ్ బిధూరి అసభ్యపదజాలం ప్రయోగించడం అత్యంత దురదృష్టకరం. వేదిక ఏదైనా విద్వేష ప్రసంగం నేరమేనని సుప్రీంకోర్టు స్వయంగా చెప్పింది. ఇలాంటి ప్రసంగాలకు ఎంపీలకు సైతం మినహాయింపేమీ లేదు' అని సీపీఎం ఓ ప్రకటనలో స్పష్టంచేసింది. శివసేన(ఉద్ధవ్) ఎంపీ ప్రియాంక చతుర్వేది ఎక్స్ వేదికగా స్పందిస్తూ డానిష్ అలీపై బీజేపీ ఎంపీ ప్రయోగించిన పదజాలం సభ్యసమాజం తలదించుకునేదిగా ఉందని ఆరోపించారు. రమేశ్ భిధూరీపై స్పీకర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ నేత సంజయ్‌సింగ్ స్పందిస్తూ ఆర్ఎస్ఎస్ నేర్పిన విలువల ఫలితమే రమేశ్ వ్యాఖ్యలని మండిపడ్డారు. మణిపూర్ హింసను ప్రస్తావించినందుకు తనను సస్పెండ్ చేశారని, డానిష్ అలీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రమేశ్‌పై ఏమి చర్యలు తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు.

రమేశ్ వ్యాఖ్యలకు బీజేపీ ఎంపీలు హర్షవర్దన్, రవి శంకర్ ప్రసాద్ నిస్సిగ్గుగా నవ్వులు వెదజల్లారని మండిపడ్డారు. అప్రజాస్వామిక భాష ప్రయోగించిన ఎంపీ రమేశ్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఎన్‌సీపీ ప్రతినిధి క్లైడ్ కాస్ట్రో ప్రశ్నించారు. ఆయనపై స్పీకర్ తక్షణమే చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీ వ్యాఖ్యల పట్ల స్పీకర్ ఓంబిర్లా ఆగ్రహం వ్యక్తంచేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించినట్లు అధికార వర్గాల తెలిపాయి. ఈ వ్యాఖ్యల పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విచారం వ్యక్తంచేశారు. తనపై చేసిన వ్యాఖ్యలను ప్రివిలేజీ కమిటీ పరిశీలనకు పంపాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్‌కు డానిష్ అలీ లేఖ రాశారు. అభ్యంతరకర పదజాలాన్ని వినియోగించడం పట్ల బీజేపీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మరోవైపు రమేశ్ బధూరీ మాట్లాడుతున్న సమయంలో పక్కనే ఉన్న బీజేపీ నేత హర్షవర్దన్ నవ్వుతూ కనిపించడం విమర్శలకు తావిచ్చింది. దీనిపై ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. రమేశ్ ఏం మాట్లాడారో తనకు సరిగా వినిపించలేదని, తనకు సంబంధం లేకపోయినా కావాలనే ఈ వివాదంలోకి లాగుతున్నారని పోస్ట్ చేశారు.

అసెంబ్లీని బహిష్కరిస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయాన్ని వెల్లడించారు. టీడీపీ ఇచ్చిన వాయిదా తీర్మానం చాలా స్పష్టంగా ఉందని, ప్రధాన ప్రతిపక్షం ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని ఒక్క అక్షరం పొల్లుపోకుండా చదవాల్సిన స్పీకర్...దాన్ని పక్కన పెట్టడం బాధాకరమని అచ్చెన్నాయుడు చెప్పారు. 'చంద్రబాబు నాయుడిపై అక్రమకేసులు వెంటనే ఎత్తి వేయాలి... ఆయన విషయంలో తప్పుచేసినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరుతూ మేం వాయిదా తీర్మానం ఇచ్చాం. కానీ స్పీకర్ వాటిని తిరస్కరిస్తున్నారు.

పైకి మాత్రం చర్చకు సిద్ధమని ప్రజలను మభ్యపెడుతున్నారు. గతంలో శాసనసభలో చర్చలు ఎలా జరిగాయో ఒక్కసారి గుర్తుచేసుకుంటే మంచిది' అని ఆయన అన్నారు. నాలుగున్నరేళ్ల నుంచి చట్టసభల్లో చంద్రబాబునాయుడిపై దుమ్మెత్తి పోయడం తప్ప... ఏనాడైనా ఈ ప్రభుత్వం ప్రజాసమస్యలపై చర్చించిందా అని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్ ఏకపక్షంగా వ్యవహరించడం వల్ల, సభలో అధికారపక్షానిది పైచేయి అవుతోందని, నాలుగున్నరేళ్లలో ఎప్పుడూ ప్రతిపక్షానికి అవకాశమివ్వలేదన్నారు. సభలో తాము మాట్లాడకుండా మైకులు కట్ చేస్తూ వాళ్లు మాత్రం సినిమా చూపిస్తున్నారని, ప్రజా సమస్యలపై చర్చించే అవకాశం ఇవ్వకుండా... ముఖ్యమంత్రి, మంత్రులు ఎప్పుడూ టీడీపీ ప్రభుత్వం చేసిన పనులపైనా, చంద్రబాబునాయుడిపై దుమ్మెత్తి పోయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. తాము వాస్తవాలు చెప్పడానికి ప్రయత్నిస్తే మైకులు ఆపేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వం వచ్చినప్పటినుంచీ ఇదే జరుగుతోందని, శాసనసభను వైసీపీ కార్యాలయం కంటే దారుణంగా మార్చిన ఘనత స్పీకర్‌కు దక్కుతుందన్నారు.

తమను 'యూజ్‌లెస్ ఫెలోస్' అన్నారని, స్పీకర్ స్థానం విలువను ఎలా కాపాడాలో కూడా ఆయనకు తెలియకపోతే ఎలా అని ప్రశ్నించారు. తమను యూజ్‌లెస్ ఫెలోస్ అని, వైసీపీ వాళ్లను 'మన సభ్యులు' అని గౌరవంగా మాట్లాడటం ఏమిటని నిలదీశారు. సాక్షి సిబ్బందిని సభలోకి అనుమతించి తాము మాట్లాడేది మాత్రమే చూపిస్తూ...అధికారపక్ష సభ్యుల వీరంగం ప్రజలకు తెలియకుండా చేస్తుంటే తాము వీడియోలు తీయక ఏమి చేయాలన్నారు. సభలో జరిగేవి ప్రజలకు తెలియకుండా స్పీకర్ కట్టడి చేస్తున్నందునే తాము సెల్‌ఫోన్లలో వీడియోలు తీయాల్సి వస్తుందని అచ్చెన్నాయుడు వివరించారు. తాము ఎప్పుడూ ప్రజాస్వామ్యబద్ధంగానే వ్యవహరించామని, ఈ ముఖ్యమంత్రి చేసే దుర్మార్గాలు, శాసనసభ ముసుగులో ఇష్టానుసారం రెచ్చిపోతుంటే చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు.

తమ వాయిదా తీర్మానం చదవడానికి కూడా స్పీకర్ నోరు తెరవనందునే సభను బహిష్కరించి...బయటకు వచ్చామన్నారు. ప్రభుత్వం, స్పీకర్ వైఖరికి తీవ్రంగా కలతచెంది సమావేశాలు ముగిసేవరకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉభయసభలకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నామని తెలిపారు.

చురుకుగా ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

అన్నం సతీష్‌ప్రభాకర్, కాపుకళ్యాణ మండపంలో ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. 90 ఏళ్ల క్రితం ఏర్పడిన తమ సంఘం అతిపురాతన సంఘంగా ఐక్యరాజ్య సమితి గుర్తింపు పొందిందన్నారు. రాష్ట్రంలో ఉన్న కష్టజీవుల సంక్షేమానికి, అభివృద్ధికి, స్థితిగతుల మెరుగుదల కోసం ఎన్నో ఉద్యమాలు నిర్మించిన పరిస్థితి సంఘానికి ఉందన్నారు. నాటి రోజుల్లో అంటరానితనం, వెట్టిచాకిరి, కట్టుబానిస విధానంతో పేదవాడిని, కష్టజీవిని, వ్యవసాయ కూలీని భూస్వాములు, జమిందారులు నిలువున దోపిడి చేశావారన్నారు. అటువంటి పరిస్థితుల్లో సంఘాన్ని ఏర్పాటు చేసి కష్టజీవులు, శ్రమజీవులు కూడా మనుషులే అని చాటి ఎర్రజెండాల పార్టీ నాయకత్వంలో అందరినీ సమీకరించి కూలీ రేట్లు సాధించి సామాజిక చైతన్యం కలిగించారన్నారు.

శ్రమజీవులకు రాజకీయ విజ్ఞానం, అక్షర జ్ఞానాన్ని కల్పించి సమాజంలో చైతన్యవంతులను చేసిన చరిత్ర వ్యవసాయ కార్మిక సంఘ నాయకులకు ఉందన్నారు. కష్టజీవుల పక్షాన పోరాటాలు సాధించి, హక్కుల సాధించిన ఎందరో అమరవీరులకు జోహార్లు అర్పించుకుంటున్నామన్నారు. కనీస వేతనాలు, సంక్షేమ పథకాలు, ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, రేషన్ కార్డులు, విద్యా, వైద్యం కల్పనకు పేదవాళ్లకు కూడా జాతీయ సంపదలో వాటా ఉండాలని నినదించామన్నారు. నేటి రోజుల్లో కార్పొరేట్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు పేదవారి చేతుల్లో భూములు లేకుండా చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పేదవాడికి భూమి దక్కించుకునే విధంగా ఐక్య పోరాటాల ద్వారా సాధించుకున్న కోనేరు రంగారావు భూ కమిటీ సిపార్సులు అమలు జరిగితే ప్రతి పేద కుటుంబానికి ఒక హెక్టారు భూమి కచ్చితంగా వస్తుందని ఆశిస్తున్నామన్నారు. పేదలకు సాగుభూమి కేటాయిస్తే సమాజంలో సామాజిక గౌరవం, సామాజిక న్యాయం దక్కుతుందన్నారు. 22వ రాష్ట్ర మహాసభల్లో పేదలకు భూములు దక్కాలనే నినాదంతో పాటు అనేక అంశాలపై చర్చించి పోరాటాలకు సిద్ధమైయ్యేందుకు భవిష్యత్తు కార్యచరణ ప్రకటించబోతున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.వెంకట్రావు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆర్.రామకృష్ణ, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు జేబీ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి తన్నీరు సింగరకొండ, సంఘ జిల్లా అధ్యక్షులు అద్దంకి నాగేశ్వరావు, ఏఐవైఎఫ్ నాయకులు ముండ్ల జాన్, బక్కా రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీ సర్కార్‌ను గద్దె దించుదాం

(మొదటిపేజీ తరువాయి)

నగరం తిరుప్పూర్‌లో శుక్రవారం నుండి మూడు రోజుల పాటు జరగనున్న ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్ సమావేశాల ప్రారంభసభలో అమర్‌జిత్ కౌర్ ప్రసంగించారు.

ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షుడు రామేంద్ర కుమార్ అధ్యక్షత వహించారు. అలెప్పిలో జరిగిన 42వ మహాసభ అనంతరం దేశంలో సంభవించిన రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిణామాలపైనా, ఇటీవల కాలంలో ఏఐటీయూసీ నిర్వహించిన కార్యకలాపాలపైనా, కేంద్ర కార్మికసంఘాల ఉమ్మడి పోరాటాలపైనా అమర్‌జిత్ కౌర్ సవివరమైన నివేదికను ప్రవేశపెట్టారు. తీవ్ర జాతీయవాదం, హిందూ ఆధిక్యతావాదం పేరుతో హిందూ-ముస్లిం విభజన భావోద్వేగాలను రెచ్చగొడుతూ, వాటి ముసుగులో కొనసాగిస్తున్న ఆర్థిక దోపిడీ విధానాల నిజస్వరూపాన్ని ప్రజలకు వివరించాలని, కార్మికవర్గ హక్కుల పరిరక్షణ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని అమర్‌జిత్ కౌర్ ఉద్ఘాటించారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 'అమృత్‌కాల్ బడ్జెట్' పేరుతో ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా మోసపూరితమైనదని, శ్రామిక ప్రజలను దగా చేసి ప్రధానమంత్రికి ఇష్టులైన ఇద్దరు, ముగ్గురు బడా పారిశ్రామిక అధిపతులకు జాతీయ సంపదను దోచిపెట్టడమే లక్ష్యంగా బడ్జెట్ రూపొందిందని ఆమె విమర్శించారు. విద్య, వైద్యం ప్రజలకు అందుబాటులో లేకుండా చేసి ప్రజల జీవితాలను దుర్భరం చేస్తున్నారని, వైద్య ఖర్చులు భరించలేక కోట్లాది మంది ప్రజలు దారిద్ర్యంలోకి దిగజారిపోతున్నారని ఆమె వివరించారు.

సమావేశాల్లో ఆంధ్రా నుంచి పాల్గొన్న జాతీయ సమితి సభ్యులు

బీజేపీ ఆర్థిక, సామాజిక విధానాలు సమాజంలో తీవ్ర అశాంతికి, ఆర్థిక సంక్షోభానికి దారి తీస్తున్నాయని అమర్‌జిత్ కౌర్ వివరించారు. ఈ సందర్భంగా ఆక్స్‌ఫామ్ నివేదికను, జాతీయ నమూనా సర్వే నివేదికను ఆమె ఉటంకించారు. కొద్దిమంది కార్పొరేట్ అధిపతుల కోసమే మోదీ ప్రభుత్వం పని చేస్తున్నదని ఆరోపించారు. దళిత, మైనారిటీ మహిళపై అత్యాచారాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటం మానవ హక్కుల పోరాటమని, అందులో ఏఐటీయూసీ శ్రేణులు అగ్రభాగాన నిలవాలని ఆమె కోరారు.

వేదికపై ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షులు ఎంఎస్ యాదవ్, బంత్ సింగ్ బ్రార్, విద్యాసాగర్ గిరి, డి.ఆదినారాయణ, ఎంఎస్ వెంకటాచలం, కేపీ రాజేంద్రన్, హెచ్ఎస్.శేషాద్రి, రామేన్ దాస్, మహమ్మద్ యూసుఫ్, సోహల్ సింగ్, కార్యదర్శులు సుకుమార్ దామ్లే, క్రిస్టఫర్ ఫోన్సెకా, వహీదా నిజామ్, జి.ఓబులేసు, సి.శ్రీకుమార్, టీఎస్ మూర్తి, సీజే జోసఫ్, కునాల్ రావత్, ఉషా సాహ్నీ, బబ్లీ రావత్ తదితరులు ఉన్నారు.

ఏఐటీయూసీ మూడురోజుల జనరల్ కౌన్సిల్ సమావేశాలు తిరుప్పూర్ నగరంలోని రామస్వామి ముత్తమ్మాళ్ తిరు మహామండపంలోని కామ్రేడ్ టి.సుందర్ రాజన్ హాలులో ప్రారంభమయ్యాయి. తొలుత ఏఐటీయూసీ పతాకాన్ని వయోవృద్ధ కార్మికనాయకుడు, తిరుప్పూర్ వస్త్ర కార్మికోద్యమ నేత సీకే రామస్వామి ఎగురవేశారు. అమరవీరుల స్మారకస్థూపం వద్ద ప్రతినిధులు పుష్పాంజలి ఘటించి జోహార్లు అర్పించారు. అలెప్పీ మహాసభ అనంతరం కన్నుమూసిన కార్మికనేతలకు, ఉద్యమకారులకు, వివిధరంగాల ప్రముఖులకు సంతాపం ప్రకటిస్తూ విద్యాసాగర్ గిరి ప్రతిపాదించిన తీర్మానాన్ని ఆమోదించి సమావేశం రెండునిముషాలు మౌనం పాటించింది. జనరల్ కౌన్సిల్ సమావేశాల ఆహ్వానసంఘం అధ్యక్షుడు, తిరుప్పూర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, సీపీఐ నేత ఆర్. బాలసుబ్రహ్మణ్యన్ స్వాగతం పలికారు. ఆహ్వానసంఘం ప్రధానకార్యదర్శి పీఆర్ నటరాజన్ తిరుప్పూర్ జిల్లా కార్మికోద్యమ పూర్వాపరాలు వివరించారు. జనరల్ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా నగర ప్రధాన కూడళ్లను, రహదారులను అరుణ పతాకాలతో అలంకరించారు. సమావేశ ప్రాంగణంలో భారతీయ కార్మికోద్యమ నేతల, తమిళనాడు స్వాతంత్ర్య పోరాట యోధుల, సామాజిక సాంస్కృతిక ఉద్యమకారుల, పోరాటాల్లో అశువులు బాసిన అమరవీరుల చిత్రపటాలు ఏర్పాటు చేశారు. దేశం నలుమూలల నుండి మూడువందల మంది సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు సమావేశాలకు హాజరయ్యారు.

సీఐడీ కస్టడీకి చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

చట్ట ప్రకారం జరుగుతున్న కార్యక్రమమని తెలియజేస్తూ రిమాండ్‌ను ఈనెల 24వ తేదీ వరకు పొడిగించారు.

క్వాష్ పిటిషన్ తిరస్కరించిన హైకోర్టు

మరోవైపు స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్, దాని ఆధారంగా ఏసీబీ కోర్టు జారీ చేసిన రిమాండ్ ఉత్తర్వులను సవాలు చేస్తూ చంద్రబాబు క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈనెల 19న ఈ పిటిషన్‌పై చంద్రబాబు తరపున సుప్రీంకోర్టు న్యాయవాదులు హరీశ్ సాల్వే, సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. సీఐడీ తరపున సుప్రీంకోర్టు న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదించారు. రెండుపక్షాల వాదనలు విన్న హైకోర్టు తీర్పు వెలువరిస్తూ చంద్రబాబు అభ్యర్థనను తోసిపుచ్చింది. ఈ తీర్పు వెలువడిన కొద్దిసేపటికే ఏసీబీ కోర్టు చంద్రబాబుని విచారణ నిమిత్తం రెండు రోజుల సీఐడీ కస్టడీకి అనుమతిచ్చింది.

రెండోరోజూ రగడ

(మొదటిపేజీ తరువాయి)

రాంబాబు టీడీపీ సభ్యులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది టీడీపీ కార్యాలయం కాదని మండిపడ్డారు. చంద్రబాబు అరెస్ట్, ఆయన అవినీతిపై చర్చకు తాము సిద్ధమన్నారు. చర్చ కన్నా రచ్చకే టీడీపీ సభ్యులు ప్రాధాన్యత ఇస్తున్నారని దుయ్యబట్టారు. చట్టసభలో జాగ్రత్తగా మాట్లాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. ముఖ్యమంత్రిని ఉద్దేశించి అసహ్యంగా మాట్లాడితే ఊరుకునేది లేదని, నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. బాలకృష్ణ తన డైలాగ్‌లు టీడీపీ కార్యాలయంలో చెప్పుకోవాలని సూచించారు. చంద్రబాబు జైలులో, ఆయన కుమారుడు ఢిల్లీలో ఉన్నందున ఆయన కుర్చీలో కూర్చోవడానికి ఇదే సరైన సమయమని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మంత్రి జోగి రమేశ్ మాట్లాడుతూ టీడీపీ సభ్యులకు కనీస అవగాహన లేదని, చంద్రబాబుపై కేసు ఎత్తివేయాలని అసెంబ్లీలో కోరడం విచిత్రంగా ఉందన్నారు. కేసు వ్యవహారం కోర్టులో తేల్చుకోవాలన్నారు. చర్చలో పాల్గొనే ధైర్యం లేకే రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ఇటు టీడీపీ సభ్యుల నినాదాలు, అటు మంత్రుల ఎదురుదాడితో సభలో తీవ్ర గందరగోళం నెలకొనడంతో స్పీకర్ సభను ఐదు నిముషాలు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత కూడా అదే పరిస్థితి నెలకొనడంతో సభ్యులపై సస్పెన్షన్ వేటు వేశారు.

అసెంబ్లీకి పాదయాత్రగా...

టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీకి పాదయాత్రగా తరలివచ్చారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు నిరసన తెలుపుతూ తుళ్లూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నుంచి అసెంబ్లీ వరకు ప్లకార్డులు చేతబూని నినాదాలు చేసుకుంటూ వచ్చారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్ అంశంపై పట్టుబడతామని నేతలు స్పష్టం చేశారు. అధికారపక్షం ఎంత దుందుడుకుగా వ్యవహరించినా వెనక్కి తగ్గేది లేదని, శాసనమండలిలోనూ చర్చకు పట్టుబడతామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో అవినీతిపై అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు ప్రభుత్వానికి స్పీకర్ అనుమతిస్తే...తమకూ అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తామన్నారు. అవకాశం ఇవ్వని పక్షంలో మీడియా సమక్షంలో బయట వివరిస్తామని తెలిపారు.

రేపు విజయవాడలో కపర్ది శత జయంతి సభ

'ప్రజాస్వామ్యం మనుగడ' అంశంపై స్మారకోపన్యాసం

విశాలాంధ్ర-విజయవాడ : కమ్యూనిస్టు నేత ఎంవీఎస్ కపర్ది శత జయంతి సభ ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో జరుగుతుందని మందలపర్తి జగన్మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విశాలాంధ్ర దినపత్రిక సంపాదకులు ఆర్వీ రామారావు 'ప్రజాస్వామ్యం మనుగడ' అనే అంశంపై స్మారకోపన్యాసం చేస్తారని పేర్కొన్నారు. ఈ సభకు శేషమ్మ కపర్ది ఇంటర్నేషనల్ ట్రస్ట్ చైర్మన్, ఆచంట ఎమ్మెల్యే సీహెచ్ శ్రీరంగనాథరాజు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ కేంద్ర కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వి.సుందర రామరాజు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు టి.వి. రమణమూర్తి తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పి.జె.చంద్రశేఖర్‌కు ఆత్మీయ సత్కారం ఉంటుందని వివరించారు. కమ్యూనిస్టు శ్రేణులు, ప్రజాస్వామ్య వాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పునరుద్ధరణ నేటికి వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

లూనార్ డే ప్రారంభమైంది. దీంతో నిద్రావస్థలో ఉన్న ల్యాండర్, రోవర్‌ను తిరిగి యాక్టివ్ చేసే చర్యలను శనివారానికి ఇస్రో వాయిదా వేసింది. కాగా, లూనార్ నైట్ సందర్భంగా చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద ఉండే మైనస్ 200 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు, అక్కడి వాతావరణ పరిస్థితులను తట్టుకుని ఇవి తిరిగి పని చేస్తాయా అన్నది సందిగ్ధంగా మారింది. ఒకవేళ విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ తిరిగి పని చేస్తే భారత్ మరో చరిత్ర సృష్టించినట్లు అవుతుంది.

అంతా గందరగోళం

(మొదటిపేజీ తరువాయి)

చేసుకుంటారు. ఇవి రెండూ దాదాపు ఒకే సమయంలో షెడ్యూలు ఉండటం వల్ల పీజీ విద్యార్థులపై ఆర్థికభారం పడుతుంది. నీట్ ర్యాంక్‌లో జీరో పర్సెంటైల్ అర్హత వారు సైతం రిజిస్ట్రేషన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వడంతో అభ్యర్థుల సంఖ్య వేలల్లో ఉంటుంది. దానివల్ల రిజిస్ట్రేషన్ల సమయంలో ఆన్‌లైన్ల సమస్యలు తలెత్తే అవకాశముంది. ఆయా కళాశాలల నుంచి అభ్యర్థులు సకాలంలో సర్టిఫికెట్లు తీసుకురాలేకపోవడం వంటి సాంకేతిక కారణాలు తలెత్తే ప్రమాదం ఉంది. వాటితోపాటు ఎంబీబీఎస్‌లో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటించకపోవడంపై వివిధ రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ సంబంధిత రూల్ ఆఫ్ రిజర్వేషన్ రోస్టర్‌ను సరిచేసుకుని పీజీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించి ఉంటే సముచితంగా ఉండేది. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల్లో సేవలందిస్తూ వైద్యులు తలమునకలై ఉన్నారు. ఈ సమయంలో పీజీ రిజిస్ట్రేషన్లకు అతి తక్కువ వ్యవధి ఉండటంతో వారు నష్టపోయే అవకాశముంది. ఈ శని, ఆదివారాల్లో బ్యాంకులు పనిచేయవని, అందువల్ల రిజిస్ట్రేషన్ల ఫీజు చెల్లింపునకు ఆటంకం ఏర్పడుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆల్ ఇండియా నీట్ పీజీ ఫలితాలు వెలువడిన తర్వాత డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ అక్రమాలపై కాంగ్రెస్ నిలదీత

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఎంబీబీఎస్ రెండో విడత కౌన్సెలింగ్ అక్రమాలను డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు వెళ్లిన కాంగ్రెస్ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. మెడికల్ కౌన్సెలింగ్ పేరుతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ రిజర్వేషన్ అభ్యర్థులకు జరుగుతున్న అన్యాయాన్ని అధికారులకు వివరించేందుకు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మస్తాన్ వలి పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం యూనివర్సిటీకి వెళ్లారు. అప్పటికే అక్కడ పెద్ద సంఖ్యలో మోహరించిన పోలీసులు ఇద్దరినే లోపలకు అనుమతిస్తామని అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, కాంగ్రెస్ నేతల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. రిజర్వ్‌డ్ కేటగిరీ విద్యార్థులకు న్యాయం చేయాలని, ఎంబీబీఎస్ రెండో విడత కౌన్సెలింగ్ రద్దు చేయాలని కాంగ్రెస్ నేతలు నినదించడంతో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. కొందరు కార్యకర్తలను పోలీసులు ఈడ్చుకు వెళ్లి పోలీస్ వాహనాల్లో వేశారు. దీనిపై గిడుగు రుద్రరాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ నిరంకుశ పాలనకు ఇదే సాక్ష్యమని విమ ర్శించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమపై పోలీసులు దూకుడుగా వ్యవహరించడాన్ని తప్పుపట్టారు. కాగా, యూనివర్సిటీ అధికారులు దిగి వచ్చి వినతిపత్రం సమర్పించడానికి పదిమంది నాయకులకు అనుమతించారు. దీంతో యూనివర్సిటీకి చేరుకున్న కాంగ్రెస్ నేతలను పోలీసులు అడ్డగించారు. లోపలకు కేవలం ఇద్దరినే అనుమతిస్తామని స్పష్టం చేశారు. వినతిపత్రం సమర్పించడానికి పదిమందిని అనుమతించాలని కాంగ్రెస్ నాయకులు పట్టుపట్టారు. పోలీసులు అనుమతించకపోవడంతో యూనివర్సిటీ ప్రధాన గేటు ముందే గిడుగు రుద్రరాజు, ఇతర ముఖ్య నేతలు నిరసనకు దిగారు. ఏపీ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు లాం తాంతియా కుమారి, నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహ యాదవ్, కర్నూలుకు చెందిన మహిళా నేత సుప్రవీణతో పాటు 22 మంది కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్ట్ చేసి గుణదల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చివరికి పది మందిని యూనివర్సిటీలోకి వెళ్లడానికి పోలీసులు అనుమతించారు.

దిద్దుబాటు చర్యలు చేపడతాం: వీసీ

ఎంబీబీఎస్ రెండో విడత కౌన్సెలింగ్‌కు సంబంధించి జరుగుతున్న అవకతవకలపై వెంటనే దిద్దుబాటు చర్యలు చేపడతామని గిడుగు రుద్రరాజుకు యూనివర్సిటీ అధికారులు హామీ ఇచ్చారు. గిడుగు రుద్రరాజు, మస్తాన్ వలితో పాటు కొంతమంది నేతలు వైస్‌చాన్సలర్ డాక్టర్ బాబ్జీ, రిజిస్ట్రార్ రాధికారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని వీసీ చెప్పారు. అనంతరం గుణదల పోలీసు స్టేషన్‌కు వెళ్లి...పోలీసులు అరెస్టు చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలను పరామర్శించారు.

ఉల్లిపై సుంకం ఉపసంహరించాలి

ఏపీ రైతుసంఘం

విశాలాంధ్ర–విజయవాడ: ఉల్లి ఉత్పత్తుల ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం 40శాతం సుంకాన్ని విధించడంతో ఉల్లి రైతులకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని తక్షణం సుంకాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ అధ్యక్షులు పి. రామ చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర నిర్ణయంతో మహారాష్ట్ర జిల్లా నాసిక్‌లో ఉల్లిగడ్డ వ్యాపారులు వేలం నిలిపివేశారని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలలో వేలం నిలిపివేయడంతో ఎగుమతులు జరగక రైతులు నష్టపోవడంతో పాటు రాబోయే రోజుల్లో భారీగా ఉల్లి ధరలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల వల్ల ఇప్పటికే ఇతర దేశాలకు అన్ని రకాల ఎగుమతులు పూర్తిగా మందగించాయన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి ఉల్లి ఎగుమతులపై సుంకాన్ని ఉప సంహరించుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

బీజేపీ, వైసీపీని సాగనంపండి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల

విశాలాంధ్ర–తాడికొండ: దేశంలో, రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్న బీజేపీ, వైసీపీలను ఇంటికి సాగనంపాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును విడుదల చేయాలని కోరుతూ స్థానిక అడ్డరోడ్డు సెంటర్‌లో టీడీపీ నాయకులు చేస్తున్న నిరాహార దీక్షా శిబిరాన్ని ముప్పాళ్ల నాగేశ్వరరావు శుక్రవారం సందర్శించి సీపీఐ తరుపున సంఘీభావాన్ని ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి విధానాలను వ్యతిరేకిస్తు న్నారని చెప్పారు. జగన్ కుట్రలు, కుతంత్రాలు సాగవని హెచ్చరించారు. జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని, ఈ నేపథ్యంలోనే దాడులకు తెగబడుతున్నాడని విమర్శించారు. చంద్రబాబు అరెస్టు వెనుక మోదీ, అమిత్ షా కుట్ర దాగి ఉందని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని 1952లోనే ఆంధ్రప్రదేశ్ రాజధాని విజయవాడ, గుంటూరు నగరాల మధ్య ఉండాలని సీపీఐ కోరిందని గుర్తుచేశారు. విశాఖ ఉక్కును ఐక్యమత్యంతో కాపాడుకోవాలని కోరారు. తెలుగుదేశం పార్టీ దీక్షా శిబిరంపై జరిగిన దాడిని ఖండించారు. మీడియా ప్రతినిధులపై దౌర్జన్యాలకు దిగవద్దని

హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు ఒకమాట ఎన్నికల తరువాత మరొకమాట మాట్లాడుతున్నారన్నారు. ఎన్నికల ముందు ఒకే రాజధాని అన్న జగన్‌మోహన్ రెడ్డి నేడు మూడు రాజధానులు అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రాలలో అన్ని రకాల ధరలు తగ్గితే మన రాష్ట్రంలో అన్ని రకాల ధరలు అనూహ్యంగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై వ్యతిరేకత నానాటికి పెరుగు తోందన్నారు. మాజీ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ శాంతియుతంగా దీక్ష చేస్తున్న శిబిరంపై పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అనుచరులు దాడి చేయాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. వైసీపీ కుట్రలు, కుతంత్రాలు టీడీపీ ముందు సాగవన్నారు.

రెండోరోజుకు అఖిలప్రియ దీక్ష

విశాలాంధ్ర బ్యూరో–కర్నూలు: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా, ఆయనపై వెంటనే కేసులు ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ మాజీమంత్రి భూమా అఖిలప్రియ చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష శుక్రవారం నాటికి రెండోరోజుకు చేరింది. చంద్రబాబును వైసీపీ ప్రభుత్వం అరెస్టు చేసిన నంద్యాలలోని ఆర్కే ఫంక్షన్ హాలు పక్కనే దీక్ష చేయాలని నిర్ణయించినట్లు అఖిలప్రియ మీడి యాకు తెలిపారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, మాజీ జడ్పీచైర్మన్ ఎ.వెంకటస్వామితో పాటు పెద్దఎత్తున కార్యకర్తలు అఖిలప్రియకు సంఘీ భావం తెలిపారు. గురువారం రాత్రి భారీ వర్షం సంభవించినా అఖిలప్రియ టెంటులోనే ఉన్నారు. అఖిలప్రియకు మద్దతుగా సోదరుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి, భర్త భార్గవ్‌తోపాటు పార్టీశ్రేణులు నిలిచారు.

జిల్లావ్యాప్తంగా టీడీపీ నిరసనలు

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కర్నూలు, ఎమ్మిగ నూరు, పత్తికొండ, ఆదోని, మంత్రాలయం, డోన్, నందికొట్కూరు, బనగానపల్లె, ఆత్మకూరులలో టీడీపీ శ్రేణులు నల్లబ్యాడ్జిలు ధరించి రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారు. టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జులు, పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొంటున్నారు.

ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం

చంద్రబాబును నిర్దోషిగా ప్రజల ముందుకు తీసుకొస్తాం: టీడీపీ ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర–విజయవాడ: హైకోర్టు తీర్పులోని అస్పష్టతపై ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, చంద్రబాబును నిర్దోషిగా నిరూపించి ప్రజల ముందుకు తీసుకువస్తామని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు డోలా బాల వీరాంజనేయస్వామి, ఏలూరి సాంబశివ రావు, మంతెన రామరాజు స్పష్టం చేశారు. మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకు సంబంధించి ప్రభుత్వం తరపున హైకోర్టులో వాదనలు వినిపించిన ముకుల్ రోహత్గీ కర్నాటక మాజీ సీఎం యడ్యూరప్ప కేసులో యాక్ట్ 17 (ఏ) వర్తిస్తుందని చెప్పి, చంద్రబాబు విషయంలో అది వర్తించదని చెప్పడం చూస్తే దేశంలో తీర్పు తీర్పులకు మార్పులు ఎలా ఉంటాయనే సందేహం ప్రజలకు కలుగుతోందన్నారు. ఈ కేసు విచారణలో న్యాయమూర్తులు సరైన దృక్పథంతో ఆలోచించలేదని తాము అభిప్రాయపడుతున్నట్లు చెప్పారు. ఈ కేసులో కింది కోర్టు ఇచ్చిన తీర్పులపై తాము ఉన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించాలని నిర్ణయించుకున్నామన్నారు. ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ న్యాయస్థానాల్లో చంద్రబాబును నిర్దోషిగా నిరూపించి ప్రజల ముందుకు తీసుకువస్తామని తెలిపారు. చంద్రబాబుపై అక్రమ కేసు పెట్టి, ఆయన్ని దోషిగా చిత్రీకరించడానికి ఈ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఎటువంటి ఆధారాలు, సాక్ష్యాలు లేని కేసులో తమ అధినేత తరపున హైకోర్టులో వేసిన క్వాష్ పిటిషన్ కొట్టివేయడం జరిగిందని అన్నారు. ఈ కేసులో ఇప్పటికే చాలామందికి ముందస్తు బెయిల్స్ వచ్చాయని, అనేకమందికి రిమాండ్ రిజక్ట్ అయ్యిందని తెలిపారు. అలాంటి కేసులో చంద్రబాబును 37వ ముద్దాయిగా అరెస్ట్ చేసి జైలులో పెట్టడం, ఆయన్ని మానసికంగా వేధింపులు, అసత్యాలు ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం, సీఎం జగన్ కుట్రలు, కుతంత్రాలు ప్రజలకు తెలియచేసి, ప్రజాక్షేత్రంలో ఈ ప్రభుత్వాన్ని దోషిగా నిలబెడతామని అన్నారు. మంతెన రామరాజు మాట్లాడుతూ ప్రభుత్వం తరపున వాదించే ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, సీఐడీ చీఫ్ ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే పని చేస్తూ, కక్ష సాధింపుల కోసమే ఒక కేసు తర్వాత మరో కేసు వేస్తున్నారన్నారు. ప్రభుత్వంపై, అధికారులపై భూములిచ్చిన రైతులు ఎందుకు న్యాయస్థానాలను ఆశ్రయించ కూడదని ప్రశ్నించారు. ప్రజల ఆశీస్సులతో చంద్రబాబు త్వరలోనే బయటకు వస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వైభవంగా గరుడసేవ

విశాలాంధ్ర–తిరుమల : తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజు శుక్రవారం రాత్రి శ్రీ మలయప్పస్వామి తనకు ఎంతో ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై లక్ష్మీకాసుల మాల ధరించి భక్తులకు అభయమిచ్చారు. రాత్రి 7 గంటలకు గరుడసేవ ప్రారంభమైంది. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు భజనలు, కోలాటాలు, జియ్యంగార్ల గోష్ఠితో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఎ.వి.ధర్మారెడ్డి, డీఐజీ అమ్మిరెడ్డి. బోర్డు సభ్యులు యానాదయ్య, సుబ్బరాజు, తిప్పేస్వామి, ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిషోర్, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాలకృష్ణ... మీ పార్టీలో తిప్పండి మీసాలు: అంబటి రాంబాబు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మీసాలు తిప్పడం వల్ల ఉపయోగం లేదని, ముందస్తుగా ఆయన పార్టీలో మీసాలు తిప్పాలని జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు. వెలగపూడిలోని అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ చంద్రబాబు అరెస్ట్, అవినీతిపై ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. సభలో చంద్రబాబు అరెస్ట్‌పై చర్చించడానికి మేం సిద్ధంగా ఉండగా, టీడీపీ వారు మాత్రం సిద్ధంగా లేరంటూ ప్రశ్నించారు. మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. చంద్రబాబు నీతిమంతుడు, నిప్పు అనే విశ్వాసం ఉంటే చర్చలో పాల్గొనాలని, పారిపోవద్దని చెప్పారు. చంద్రబాబు జైలులోను, లోకేశ్ ఢిల్లీలో ఉన్నారని, ఈ అవకాశం మళ్లీ రాబోదని, నందమూరి వంశ ప్రతాపాన్ని చూపాలని, మీ టీడీపీని బతికించుకోవడానికి ఇది చక్కని అవకాశమని సూచించారు. ఈనెల 21న అసెంబ్లీలో స్పీకర్‌పై టీడీపీ సభ్యులు దాడికి ప్రయత్నించారన్నారు. బాలకృష్ణ వ్యవహారంపై మొదటి హెచ్చరిక జారీ చేశారని, తప్పు చేస్తే రెండవ హెచ్చరిక ఉంటుందని గుర్తు చేశారు. చంద్రబాబును అరెస్ట్ చేసినందునే ఏదో ఒక గొడవ చేయాలని, పేపర్లు చించేసి పోడియంపై ఉన్న మానిటర్‌ను పీకేశారన్నారు. చర్చకు వైసీపీ అంగీకరించిన తర్వాత టీడీపీ రాద్ధాంతం చేస్తోందంటూ మంత్రి అంబటి వ్యాఖ్యానించారు.

జాతీయ విద్యావిధానంతో నష్టం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: బీహార్ లోని బేగుసరాయ్‌లో జరిగే ఏఐఎస్ఎఫ్ 30వ జాతీయ మహాసభలకు విద్యార్థిలోకం తరలి రావాలని ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను కామ్రేడ్ నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో జిల్లా నాయకులతో కలసి శుక్రవారం విడుదల చేశారు. అనంతరం జాన్సన్ బాబు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. నూతన జాతీయ విద్యావిధానం పేరుతో విద్యను కాషాయీకరణ చేస్తోందని చెప్పారు. మూఢనమ్మకాలు ప్రోత్సహించే ఈ విద్యావిధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానాన్ని అమలు చేస్తూ సీఎం జగన్ విద్యార్థులకు నష్టం కలిగిస్తున్నారని చెప్పారు. విద్యా వ్యాపారానికి జగన్ కుట్ర పన్నారని ఆరోపించారు. పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేసేందుకు 107, 108 జీవోలు తీసుకొచ్చారన్నారు. ఎంబీబీఎస్ సీట్లను విచ్చలవిడిగా అమ్ముకుంటున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ఈనెల 28 నుండి అక్టోబర్ 1 వరకు జరిగే జాతీయ మహాసభల్లో కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి కుల్లాయ్ స్వామి, నగర అధ్యక్షుడు ఉమా మహేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, నగర నాయకులు మంజు, ఆనంద్, హరి, విశ్వ, రారాజు, కార్తీక్, సిద్దు, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఎప్పుడిస్తారు?

శాసనమండలిలో ప్రశ్నించిన లక్ష్మణరావు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రాష్ట్రంలో ఉపాధ్యాయుల భర్తీ కోసం నియమించే డీఎస్సీని ఎప్పుడు ప్రకటిస్తారని పీడీఎఫ్ సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు శాసనమండలిలో ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మాట్లా డుతూ, ఈ ప్రభుత్వం వచ్చిన నాలుగున్నర ఏళ్లలో ఇంతవరకు ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వకపోవడం విచారకరమన్నారు. కేంద్ర మానవ వనరుల శాఖ రాష్ట్రంలో 40 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించిందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ మాత్రం అతి తక్కువగా లెక్కలు చెప్పడాన్ని తప్పుపట్టారు. ఇప్పటికైనా డీఎస్సీ ఎప్పుడు ప్రకటిస్తారో స్పష్టంగా చెప్పాలంటూ మంత్రిని సూటిగా ప్రశ్నించారు. వెంటనే జంబో డీఎస్సీ ప్రకటించి నిరుద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సమాధానం చెప్పేందుకు లేవగా మండలిలో టీడీపీ సభ్యుల నిరసన వల్ల గందరగోళం ఏర్పడింది.దీంతో మండలిని వాయిదా వేశారు.

టీడీపీ నిరసనతో మండలిలో గందరగోళం

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రాష్ట్ర శాసన మండలిలో శుక్రవారం గందరగోళం నెలకొంది. మాజీ సీఎం చంద్రబాబు అరెస్టుపై వాయిదా తీర్మానంపై చర్చ జరిపేందుకు టీడీపీ సభ్యులు బి.తిరుమల నాయుడు, రాజగోపాల్ రెడ్డి, రామారావు, అశోక్ బాబు తదితరులు పట్టుపట్టగా, చైర్మన్ మోషెన్ రాజు తిరస్కరించారు. అటు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తామని హామీ ఇచ్చిన జాబ్ కేలండర్ విషయంపై చర్చ కోసం పీడీఎఫ్ సభ్యులు కే ఎస్ లక్ష్మణ రావు, ఇళ్ల వెంకటేశ్వర రావు, షేక్ సాబ్జీ తదితరులు ఇచ్చిన వాయిదా తీర్మానాలను తిరస్కరిస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. అనంతరం ప్రశ్నోత్తరాల కార్యక్రమం ప్రకటించారు. టీడీపీ సభ్యులు చైర్మన్ పోడియంను, చైర్‌ను చుట్టుముట్టి చంద్రబాబుపై అక్రమ కేసులు ఎత్తేయాలని, ప్రజాస్వామ్యం పరిరక్షించాలని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. ఆ సమయంలో చైర్మన్ మోషెన్ రాజు, మంత్రి అంబటి రాంబాబు ప్రతిపక్ష సభ్యులు కోరిన అంశంపై మంగళ వారం చర్చిం చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, సభ్యులు సంయమనం పాటించి సహకరించాలని కోరారు. అప్పటికీ సభ్యులు వినకపోవడంతో ఉదయం 10-10 గంటలకు మండలిని కొద్ది నిమిషాలపాటు వాయిదా వేశారు. తిరిగి సమావేశం కాగానే చైర్మన్ ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని ప్రకటించారు. ఈ సమయంలో మార్షల్స్ సభలో ప్రవేశించి పోడియం పైకి వెళ్లేందుకు ప్రయత్నించి నినాదాలు చేస్తున్న సభ్యులను అడ్డుకున్నారు. ఆ గందరగోళ సమయంలోనే మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యరాయణ తదితరులు తమ శాఖలకు సంబంధించి సభ్యుల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

28న ఏపీ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర సమావేశం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని ఈనెల 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు విజయవాడ గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహిస్తా మని సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యలు, పదోన్నతులు, రేషియో వన్ టైం సెటిల్మెంట్, గ్రేడ్ 2 వీఆర్వోల ప్రొహిబిషన్ ఇతర సమస్యలపై చర్చిస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న జీపీఎస్, ఓపీఎస్ పైనా చర్చిస్తామని వివరించారు. ప్రభుత్వం కేబినెట్‌లో జీపీఎస్‌పై నిర్ణయం తీసుకుందని గుర్తు చేశారు. జీపీఎస్‌పై సరైన విధివిధానాలు లేకపోవడంతో సీపీఎస్ ఉద్యోగులందరూ పాత పెన్షన్ విధానం కావాలని ఉద్యమిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు అందరూ పాత పెన్షన్ విధానమే అమలు చేయాలని కోరుతున్నందున ఈ రాష్ట్ర కమిటీ సమావేశంలో చర్చిస్తామన్నారు. సమావేశానికి రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

'కళాజాతా'లకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర–విజయవాడ : భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ తరపున మూడు సంవత్సరాల పాటు కళాజాతాల నిర్వహణ కోసం వ్యక్తిగతంగా లేదా బృందాలుగా కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆంధ్ర ప్రదేశ్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ పి.రత్నాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది మందికి పైగా కళాకారుల బృందం అయితే రూ.2 వేలు, బృందంలో 10 మంది లోపు ఉన్నట్లయితే వెయ్యి రూపాయల రిజిస్ట్రేషన్ ఫీజు మొత్తాన్ని డీడీగా 'డీడీసీ, సీబీసీ, విశాఖపట్నం' పేరిట విశాఖపట్నంలో చెల్లుబాటు అయ్యే విధంగా చెల్లించవలసి ఉంటుంది. దరఖాస్తులను అక్టోబర్ 10వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు అదేవిధంగా 'ది జాయింట్ డైరెక్టర్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, కేంద్ర సమాచార- ప్రసార మంత్రిత్వ శాఖ, 2వ అంతస్తు, సీజీఓ కాంప్లెక్స్, ఆటో నగర్, విజయవాడ-500007 (ఆంధ్ర ప్రదేశ్)' చిరునామాకు పంపాలి. నక్సల్ ప్రభావిత శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి ప్రాంతాల కళాకారులకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఉంటుంది. అలాగే బృందంలో 50 శాతం మంది (మహిళా బృందాలైనా), ఎస్సీ, ఎస్టీ కళాకారులు ఉన్న వారికి కూడా రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఉందని, ఈ అవకాశాన్ని కళాకారులు వినియోగించు కోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు www.davp.nic.in, www.cbcindia.gov.in వెబ్‌సైట్‌లలో నోటిఫికేషన్‌ను చూడవచ్చని పేర్కొన్నారు.

గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు పరిరక్షించాలి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు అనంత నాయక్

విశాలాంధ్ర బ్యూరో–పాడేరు: గిరిజన సంస్కృతి, భాషలు, సాంప్రదాయాలను పరిరక్షించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు అనంత నాయక్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరులో రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన ఇక్కడకు చేరుకున్నారు. మోద కొండమ్మ అమ్మవారి దర్శనం అనంతరం స్థానిక శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. కాఫీ, జీసీసీ, వన్ధన్ వికాస కేంద్రం స్టాళ్లను సందర్శించారు. జిల్లాలో కాఫీ సాగు, ఉత్పత్తి, గిరిజన రైతులు కాఫీ సాగులో పొందుతున్న ఆదాయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాఫీ, సాగు, జీసీసీ సేవలు, ఉత్పత్తులను, మండలానికి చెందిన 113 వన్ వికాస కేంద్రాలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వివరించారు. పాడేరులో 160 ఎకరాల భూములకు పట్టాలు పంపిణీ చేశారు. ముందుగా 30 మందికి అటవీ హక్కు పత్రాలు అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రైతు భరోసా వ్యవసాయ పెట్టుబడులు గురించి అధికారులు వివరించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఇంటి దగ్గర బాగుందా, పాఠశాలలో బాగుందా అని విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీని అధికారులు వివరించారు. వ్యవసాయ పనుల్లో తల్లిదండ్రులకు సాయం చేస్తారా అని ప్రశ్నించగా, చేస్తామని విద్యార్థులు ఒడియా భాషలో వివరించారు. జలియన్‌వాలా బాగ్ సంఘటనపై ప్రశ్నించగా, భారత స్వాతంత్ర్య పోరాటంలో వెయ్యి మంది గోండు గిరిజనులు ప్రాణాలను అర్పించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంపాదకీయం

పార్లమెంటు వేదికగా విద్వేషం

'ఇతను ఉగ్రవాది, ఈయన తీవ్రవాది. ఈ ముల్లాను బయటకు విసిరేయండి.' ఈ మాటలు అన్నది ముస్లింలను నోరారా దూషించడానికి అలవాటు పడిన బీజేపీ నాయకులో, కార్యకర్తలో కాదు. బీజేపీ లోకసభ సభ్యుడు రమేశ్ భిధూరీ. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని ప్రమాణం చేసిన వ్యక్తి నిండు పార్లమెంటులో కనిదీరా బహుజన్ సమాజ్ పార్టీకి చెందిన ముస్లిం డానిష్ అలీ మీద చేసిన వ్యాఖ్యలు. ఈ వ్యాఖ్యలు పార్లమెంటు ప్రత్యక్ష ప్రసారంలో పొల్లుపోకుండా వినిపించాయి. భిధూరీ అంతటితో ఆగలేదు. డానిష్ అలీని తార్పుడుగాడు, ఖత్నా చేయించుకున్న వాడు అని కూడా అన్నారు. ఖత్నా చేయించుకోవడం ముస్లింల మతపరమైన ఆచారం లేదా నియమం. దక్షిణ దిల్లీ నుంచి ఎంపికైన భిధూరీ సాటి సభ్యుడిని తార్పుడుగాడనడం బీజేపీలో సర్వత్రా వ్యాపించిన విద్వేషానికి తార్కాణం. భిధూరీ ఈ వ్యాఖ్యలు చేసిన సమయంలో కాంగ్రెస్ సభ్యుడు కొడికున్నార్ సురేశ్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు. ఈ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించమని అధికారులను ఆదేశించానని చెప్పారు. కానీ కేవలం రికార్డుల నుంచి తొలగించినంత మాత్రాన విద్వేష ప్రచారానికి నిష్కృతి లభిస్తుందా? అలాంటి విద్వేషాగ్నిని వ్యాపింప చేసేవారికి రికార్డులనుంచి పరిహరించడం శిక్ష అవుతుందా? భిధూరీ లాంటి వారు నిర్భయంగా పార్లమెంటు సాక్షిగా ఇలాంటి ముస్లిం వ్యతిరేక అపశబ్దాలు పలుకుతున్నారంటే దానికి కారణం సంఘ్ పరివార్ పెంచి పోషించిన ముస్లిం వ్యతిరేకతే. అది వారి రాజకీయ సిద్ధాంతానికి ప్రాతిపదిక. పోరాడవలసింది ఆ సైద్ధాంతికతతో. పార్లమెంటు రికార్డుల నుంచి తొలగించినంత మాత్రాన ఒరిగేది ఏమీ ఉండదు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని లోకసభ స్పీకర్ ఓం బిర్లా తీరికగా చెప్తున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పునరావృతం అవడానికి ఎన్నిసార్లు ఇలాంటి విద్వేషం విరజిమ్మాలో! తీవ్రంగా పరిగణించడం లాంటి పడికట్టు మాటలను వాడడానికి బదులుగా రమేశ్ భిధూరీని సభ నుంచి కనీసం సస్పెండ్‌చేసే చొరవ స్పీకర్ చూపకపోవడం ఆయన పక్షపాత వైఖరికి నిదర్శనం. ఇది కచ్చితంగా ద్వంద్వ ప్రమాణమే. ప్రభుత్వాన్ని నిలదీసినంత మాత్రాన రాహుల్‌గాంధీ మీద కత్తిగట్టినట్టు ప్రవర్తించారు. వర్షాకాల సమావేశాలలో ప్రభుత్వాన్ని నిలదీసిన ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్‌ను ఆ సమావేశాల కాలం ముగిసేదాకా సస్పెండ్ చేశారు. మరి భిధూరీకి ఆ కొలమానమే వర్తించక పోవడానికి స్పీకర్ తన పూర్వాశ్రమాన్ని మరిచిపోకపోవడమే కారణం అనుకోవాలి. ఆయన ఒకప్పుడు ఆర్.ఎస్.ఎస్. కార్యకర్త. అందుకే సభా మర్యాద పాటించకపోవడమే కాకుండా విద్వేషాన్ని వెదజల్లిన బీజేపీ ఎంపీని శిక్షించడానికి వెనుకాడుతున్నారు. స్పీకర్ స్థానంలో ఉన్నవారు అంతకుముందు ఏదో ఒక రాజకీయ పార్టీతో సంబంధం ఉన్నవారు కావొచ్చు. అది కొత్తా కాదు. ఆశ్చర్యకరమూ కాదు. కానీ స్పీకర్ స్థానాన్ని స్వీకరించిన తరవాత నిష్పక్షపాతంగా వ్యవహరించే సంస్కారాన్ని అలవరచుకోవాలి. ఈ సంప్రదాయం నీలం సంజీవ రెడ్డి, సోమనాథ్ చటర్జీతోనే అంతమైందనుకోవాలా? వారిద్దరూ స్పీకర్ స్థానం స్వీకరించే ముందే తమ పార్టీలకు రాజీనామా చేశారు. రమేశ్ భిధూరీ ప్రవర్తనకు బీజేపీ సీనియర్ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ క్షమాపణ చెప్పి ఈ వ్యవహారానికి అక్కడితో ముగింపుపలికే ప్రయత్నం చేశారు. ఆయన క్షమాపణ చెప్పడాన్ని అభ్యంతరం పెట్టవలసిన అవసరం లేదు. కానీ ఆయన ఎవరి తరపున క్షమాపణ చెప్తున్నారు. రాజ్‌నాథ్ సింగ్ బేషరతుగా క్షమాపణ చెప్పలేదు. ప్రతిపక్షాలు భిధూరీ వ్యాఖ్యలకు నొచ్చుకుని ఉంటే క్షమించండి అని మాత్రమే అన్నారు. ఇదే సంఘటన బీజేపీ సభ్యుల విషయంలో జరిగితే ఎంత రభస జరిగి ఉండేది. డానిష్ మీద ఇంతటి తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తే మిగతా ముస్లిం సభ్యులు ఎందుకు స్పందించలేదు? పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి ప్రహ్లాద్ జోషీ ఈ పనిచేస్తే సబబుగా ఉండేది. కానీ ఆయన ఇంతవరకు ఆ పని చేయలేదు. నిజానికి ఇది పార్లమెంటులో జరిగిన సంఘటన కనక సభా నాయకుడు కూడా అయిన ప్రధానమంత్రి మోదీ క్షమాపణ చెప్తే మరింత సముచితంగా ఉంటుంది. కానీ క్షమాపణ చెప్పే అలవాటు మోదీకి ఎప్పుడూలేదు. ఇప్పుడు ఉంటుందనుకోవడం భ్రమ. ఆయనకు ఈ పాటి ఔదార్యం ప్రదర్శించే సంస్కారం హఠాత్తుగా అబ్బుతుందనుకోలేం. హత్రాస్, కథువా లాంటి దుర్మార్గాలు జరిగినప్పుడే ఆయన ఉలకలేదు. పలకలేదు.

తనను మతం పేరెత్తి దూషించినందుకు మానసికవ్యథకు గురైన డానిష్ అలీ లోకసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తాను అనేంత దాకా వెళ్లారు. ఇది ఆయన తీవ్ర మనోవేదనకు నిదర్శనం కావచ్చు. కానీ రాజీనామా చేయాల్సింది డానిష్ అలీ కాదు. భిధూరీ వ్యాఖ్యలను సభా హక్కుల కమిటీకి నివేదించాలని డానిష్ అలీ లోకసభ స్పీకర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. పాత పార్లమెంటు భవనంలో జరిగిన దుస్సంఘటనలను మరిచిపోవాలని నూతన పార్లమెంటు భవన ప్రారంభోత్సవ సమావేశంలో రాజ్యసభ అధ్యక్షుడు, లోకసభ స్పీకర్, కడకు ప్రధానమంత్రి మోదీ కూడా హితవచనాలు పలికారు. నూతన పార్లమెంటు భవనంలో ఇలాంటి ఉదంతాలు జరగడం దురదృష్ట కరమని డానిష్ తన లేఖలో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో దర్యాప్తు చేయించాలని కోరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జై రాం రమేశ్ బీజేపీ సభ్యుడి అనుచిత ప్రవర్తనను తీవ్రంగా ఖండించారు. రాజ్‌నాథ్ సింగ్ క్షమాపణ చెప్పినంత మాత్రాన ప్రయోజనం లేదన్నారు. ఇది కంటి తుడుపు చర్య అన్నారు. నిజానికి భిధూరీ వ్యాఖ్యలు డానిష్‌ను, పార్లమెంటును మాత్రమే అవమానించడం కాదు. ప్రతి భారతీయుడిని పనిగట్టుకుని అవమానించడమే. ఇకనైనా జరగవలసింది అనుచిత ప్రవర్తనకు పాల్పడ్డందువల్ల బీజేపీ సభ్యుడు భిధూరీని సభ నుంచి కనీసం సస్పెండ్ చేయాలి. చిత్తశుద్ధి ఉంటే బీజేపీ ఆయన మీద కఠినమైన క్రమశిక్షణా చర్య తీసుకోవాలి. కానీ అలా ఎన్నటికీ జరగదు. ఎందుకంటే ముస్లింల మీద విద్వేషం వెదజల్లడం ఆ పార్టీ విధానం. అదే ఆ పార్టీ రాజకీయ సిద్ధాంతం. పార్లమెంటు నియమాల ప్రకారం భిధూరీ మీద చర్య తీసుకోవడం ఎలాగూ జరగవలసిందే. కానీ బీజేపీ దుర్నీతి, విధ్వంసకమైన విద్వేషవైఖరి మీద సైద్ధాంతిక స్థాయిలో తీవ్ర పోరాటం జరగాలి. ఇలాంటి సైద్ధాంతికతకు రాజకీయాలలో చోటు లేకుండా చేయగలగాలి. అది సులభమైందీ కాదు. సత్వరం ఫలితం ఉండేదీ కాదు. విద్వేష రాజకీయాలను ఎదిరించడానికి సెక్యులర్, ప్రజాస్వామ్య విలువల మీద అపేక్ష ఉన్నవారు సమైక్యంగా దీర్ఘకాల పోరాటం కొనసాగించక తప్పదు.

విశ్వకర్మ వెనుక దుష్టచింతన

(టి.మయూర ప్రియన్)

ప్రధానమంత్రి తాజాగా ప్రకటించిన విశ్వకర్మ యోజన పథకం వెనుకు దుష్ట చింతనేఉంది. ఆర్‌ఎస్‌ఎస్‌కు హిందూరాష్ట్ర సాధన 'లక్ష్యం' దాదాపు శతాబ్దికాలంగా ఉంది. ఇందుకు అనుకూలంగానే బీజేపీ నాయకుడు ప్రదానమంత్రి నరేంద్ర మోదీ గత తొమ్మిదేళ్లుగా పరిపాలన చేస్తున్నారు. కులాలు, మతాలు కొనసాగాలన్న 'లక్ష్యం' విశ్వకర్మయోజన వెనుక దాగి ఉంది. ఈ పథకానికి రూ.13వేల కోట్లు కేటాయించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ, నైపుణాభివృద్ధి పరిశ్రమల మంత్రిత్వశాఖ, ఆర్థిక, సేవల అభివృద్ధి విభాగం, ఆర్థిక మంత్రిత్వశాఖలు కలిసి రూ.13వేల కోట్లను అందచేస్తాయి. కేంద్ర మంత్రివర్గం కూడా దీనికి ఆమోదించినట్లు తెలుస్తోంది. బహుశా మోదీ ప్రకటించిన తర్వాత ఇక మంత్రివర్గం ఆమోదం అవసరం ఉండాలా?

1952లో అప్పటి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి చక్రవర్తుల రాజగోపాలాచారి చాకలి కులంవాళ్ల సభలో మాట్లాడుతూ, వివిధ కులవృత్తులు చేస్తున్నవారు వాటిని కొనసాగించాలని అన్నారు. మోదీ ఇప్పుడు అదే ఆలోచనలతో ఈ పథకం ప్రకటించారు. సంప్రదాయంగా వస్తున్న కులవృత్తులవారు నైపుణ్యాలను పెంచుకునేందుకు సహాయం చేస్తామని చెప్పడానికి విశ్వకర్మ యోజన పథకం. మూడువేల సంవత్సరాలక్రితం అంటే మధ్యయుగాలలో అనుసరించిన నిచ్చెనమెట్ల సామాజిక వ్యవస్థను పునరుద్ధరించాలనే ఆలోచన ఆర్‌ఎస్‌ఎస్ రహస్య అజెండాను అమలు చేయడమే మోదీ లక్ష్యంగా కనిపిస్తోంది. నైపుణ్యాలు పెంచుకునేందుకు శిక్షణకూడా ఇస్తారట. లక్షల కోట్ల సంపన్నులకు, సామాన్యులకు మెతుకులు విదిల్చే పాలన మోదీ కొనసాగిస్తున్నారు.

ఈ పథకాన్ని తమిళనాడు అధికార పార్టీ డీఎంకె, డీకె వ్యతిరేకిస్తున్నాయి. పుట్టినప్పుడే నిర్ధారణఅయ్యే కులాన్ని ఈ పథకం ద్వారా కొనసాగించాలని మోదీ కోరుతున్నారని, అందువల్లే తాము వ్యతిరేకిస్తున్నామని ఈ పార్టీలు చెప్పాయి. తమిళనాట ఈ పథకాన్ని గట్టిగా వ్యతిరేకిస్తామని డికె అధ్యక్షుడు కృష్ణస్వామి వీరమణి అన్నారు. ఈ పథకానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేయాలని డీకె, డీఎంకె, కాంగ్రెస్, విడుతలై తిరుత్తైగల్‌కచ్చి, మరుమలార్చి ద్రవిడ మున్నేట్రకజగం, (ఎడీఎంకె) సీపీఎంలు నిర్ణయించాయి.

కులవృత్తులు కొనసాగించాలని చెప్పిన రాజగోపాలాచారి 1953లోనే "ప్రాథమిక స్థాయి మద్రాసు పథకం"గా ప్రకటించారు. ఈ పథకం గురించి మంత్రులనుగానీ, శాసనసభ్యులనుగానీ సంప్రదించకుండా రాజగోపాలాచారి ప్రకటించారు. ప్రాథమిక పాఠశాలల పనిగంటలను 5నుంచి 3 గంటలకు తగ్గించారు. అలాగే విద్యాబోధనను రెండు షిఫ్టులుగా మార్చు చేశారు. మొదటి షిఫ్ట్ అయిపోయిన విద్యార్థులు ఇంటివద్ద ఉండి, తల్లిదండ్రులు చేసే వృత్తికి సహకరించాలని ప్రకటించారు. మన దేశంలో కులాల ఆధారంగా



అత్యధిక వృత్తులను నిర్ధారించారు. అందువల్ల ఈ కులాలకు చెందిన పిల్లలు వైద్యులు, న్యాయవాదులు, ప్రభుత్వ ఉద్యోగాలలో చేరలేకపోయారు. అగ్రవర్ణాలవారే మెజారిటీ డాక్టర్లు, లాయర్లు తదితర వృత్తులలో, ఉన్నతస్థాయి ఉద్యోగాలను చేపట్టగలిగారు. సమాజంలో ఈ కులాల పిల్లలు కుండలు తయారుచేయడం, చెప్పులు కుట్టడం, చర్మకారులుగా, రైతులుగా, పాకీపనివాళ్ళుగా స్థిరపడిపోయారు. వంశపారంపర్యంగా తమ వృత్తులను కొనసాగిస్తున్నారు. ఈ అసమానమైన పథకం వల్ల ఎగుడు దిగుడు స్థాయిలోనే ఉన్నారు. ఉన్నత ఉద్యోగాలకు వెళ్లలేకపోతున్నారు.

అనుమానాస్పదమైన ఆనాటి వంశపారంపర్య విద్యా విధానాన్ని తాంతై పెరియార్ తీవ్రంగా వ్యతిరేకంచారు. 'వర్ణాశ్రమ ధర్మం' స్థిరపరిచేందుకు, పునర్నిర్మించి కనొసాగించడానికి ఈ పథకాన్ని ప్రకటించారని పెరియార్ విమర్శించారు. ఆనాడు రాజగోపాలాచారి ప్రకటించిన పథకాన్ని వ్యతిరేకిస్తూ మద్రాసు రాష్ట్రంలో ఏడాదికిపైగా ఉద్యమం చేశారు.

అప్పట్లో డీఎంకె అసెంబ్లీలో ప్రతిపక్షంగా ఉంది. ఈ పథకాన్ని వ్యతిరేకిస్తూ పథకాన్ని రద్దు చేయాలని సవరణ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ ఈ పథకంపై రెండుపక్షాలుగా అమలు చేయరాదని, రద్దు చేయాలని కోరారు. కంగాయమ్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అవమానకరంగా ఓడిపోయిన తర్వాత, పథకం అమలు చేయనివ్వకపోతే రాజీనామా చేస్తానని రాజగోపాలాచారి ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలుచేసి తీవ్ర ఒత్తిడి చేసిన తర్వాత, ప్రతిపక్షాల డిమాండ్, అధికారపార్టీ కాంగ్రెస్‌లోనే వ్యతిరేకత రావడం వల్ల 1954లో రాజగోపాలాచారి పదవికి రాజీనామా చేశారు.

రాజగోపాలాచారి ప్రకటించిన పథకానికి, తాజాగా ప్రధాని మోదీ ప్రకటించిన 'విశ్వకర్మయోజన' పథకానికి చాలా దగ్గర పోలికలున్నాయి. ఈ పథకం కులాధారమైనదేకానీ కేవలం వృత్తికి సంబంధించినది కాదు. విశ్వకర్మ యోజన ప్రకారం ప్రయోజనం పొందడానికి 18ఏళ్లు ఉండాలి. అర్హమైన వయస్సున్న యువకులు జీవనవృత్తిని యూనివర్సిటీ విద్యద్వారా ఎంచుకోవచ్చునని ఈ పథకం సూచిస్తోంది. తమకు నచ్చిన వృత్తులతో కూడిన చదువులను ఎంచుకోవాలని సూచించింది. దిగువ కులాలుగా చూస్తున్న కుటుంబాల యువకులకు తమ కులాల సంకెళ్ల నుంచి బైటపడేందుకు సరైన జీవన విధానాన్ని ప్రకటించకుండా ఇంకా కులవృత్తులతోనే సరిపెట్టాలని ఈ పథకం ప్రకటించారని భావించవలసి వస్తోంది.

వంద శాతం పురుషుల బిల్లు...

మార్కెట్‌లో బెండకాయలు చివర్ల విరుస్తూ విరిగిన కాయల్ని సీవండి మూకుడులోనూ, విరక్కుండా వంగిన కాయల్ని బుట్టలోనూ వేసే పనిలో ఉన్నారు వడ్డి సూర్యనారాయణ. వైట్ అండ్ వైట్‌లో నుదుటన కుంకుమ బొట్టుతో, దాని కింద తెల్లటి వీభూది నామంతో నవ్వంటే తెలియని ముఖంతో చాలా సీరియస్‌గా బెండకాయల ఎంపికలో బిజీగా ఉన్నారాయన. పక్కన వంకాయలు ఏరే పనిలో ఉన్న సుందర్రావ్ "సర్పంచ్‌గారు నమస్తే" అని పలకరించారు. సర్పంచ్ నవ్వలేదు. అలాగని ప్రతి నమస్కారం కూడా చేయలేదు. ఆ మాటకొస్తే అతని వైపే చూడలేదు. కాని, కూరగాయలు అమ్మే దుకాణం కుర్ర యజమాని "అదేంటి ఈయన సర్పంచ్ కాదుగా. ఈయన భార్య కదా సర్పంచ్" అని అమాయకంగా అడిగాడు. ఇప్పుడు తలఎత్తి ఇద్దరి వైపు చూసారు సూర్యనారాయణ అదీ కాస్త కోపంగా. "మేడమే సర్పంచ్ కాని....పెత్తనమంతా ఈయనే కదా. అందుకే కదా అందరూ సూర్యనారాయణ సర్పంచ్ గారు అని పిలుస్తారు" అని సమాధానం ఇచ్చారు సుందర్రావ్. మళ్లీ సుందర్రావే కలుగజేసుకుని "చట్టసభల్లో ఆడోళ్లకి 33 శాతం రిజర్వేషన్ ఇచ్చేసారు. అన్ని పార్టీలు ఈ బిల్లుకి పార్లమెంటులో మద్దతు కూడా ఇచ్చేశాయి" అన్నారు. సరిగ్గా ఆ సమయంలోనే కూరగాయల దుకాణంలోఉన్న ఎఫ్ ఎం రేడియోలోంచి "చట్టసభలలో సీట్ల కోసం... భర్తలతోనే పోటీచేసి" అంటూ గుండమ్మ కథ సినిమాలో ఎన్టీఆర్, సావిత్రిల పాట వస్తోంది. "అంటే వంద మంది గెలిస్తే అందులో 33 మంది ఆడోళ్లుంటారాండి" అని మళ్లీ ఆ కూరగాయల కుర్రాడే అడిగాడు. "అవున్రా నాయనా... ఇక అంతా

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

ఆడవారి రాజ్యమే" వివరించారు సుందర్రావ్. "ఇప్పుడు మన సర్పంచ్ గెలిచినట్టేనాండి" అంటూ వడ్డి సూర్యనారయణవైపు అదోలా చూశాడు కుర్రాడు. సూర్యనారాయణ కూడా కోపంగానే చూశాడు కాని ఏం మాట్లాడలేదు. సుందర్రావ్ మాత్రం వాళ్లిద్దరిని గమనించకుండా తన లోకాన తాను మాట్లాడేస్తూ... "మరి రిజర్వేషన్ అంటే ఏటనుకున్నావ్. అదే మరి. ఆడవాళ్లంతా అధికారంలోకి వస్తారు. ఆళ్ల చుట్టూనే తిరగాలి అందరూ" అన్నారు. మళ్లీ ఆ కుర్రాడు "అంటే" అంటూ సర్పంచ్ భర్తకేసి చూస్తూ నసిగాడు. "చెప్పరా. ఏటి డౌటా. అడుగు. చెప్పేస్తాను" అన్నారు హుషారుగా. ఆ కుర్రాడు సర్పంచ్ భర్త వడ్డి కేసి చూస్తూ "ఇప్పుడు మన పంచాయితీలో ఏదైనా పని ఉందనుకోండి సర్పంచ్‌గారికి చెబుదామని వెళ్తే ఆ కుర్చీ పక్క కుర్చీలో ఈయనుంటారు. ఈయనకే అన్ని చెప్పాలి. సర్పంచ్ వింటున్నట్లుగా ఉంటారు కాని ఏం వినరు. అంతా ఈ బాబు విని నువ్వెళ్లి ఆళ్లని కలు. నే చెప్పేనని చెప్పు. పని అయ్యాక కర్రట్టుకుని మా వోడు కూర్చుంటాడు. ఆడి అడిగింది ఇచ్చేయ్" అంటారు. ఈ రిజర్వేషన్లు వచ్చాక కూడా అలాగే ఉంటదా... ఏమైనా మారుతుందా అని ఓ సిన్న డౌటు" అన్నాడు. "ఇది సిన్న డౌట్రా బాబూ. దేశాన్ని ఊపేసే డౌటైతేను. దేవుడికి ఏమైనా చెప్పాలనుకో ముందెవరికి సెప్తాం. పూజారికే కదా... ఇది అంతే... ఈ 33 శాతం రిజర్వేషన్‌తో ఆడోళ్లు గెలుస్తారంతే.... మిగిలినదంతా పూజారులు అదే ఆ ఆడోళ్ల భర్తలే చేస్తారు" అన్నారు సవివరంగా. "ఇప్పుడు సర్పంచ్ కారుంటుంది. అందులో ముందు సీట్లో వడ్డి సారు కూర్చుంటారు. ఊర్లో ఎవరైనా కారు ముందుకి వస్తే ఈ వడ్డి సార్‌కి దండంపెట్టి ఆ తర్వాత సర్పంచ్‌కి పెట్టాలన్నమాట. అంటే పదవి అమ్మది పెత్తనం భర్తది అన్నమాట" అని కూడా సెలవిచ్చారు సుందర్రావ్. "కాదండి గురువుగారు. ఇప్పుడు డబ్బుల మంత్రి నిర్మలా రామం కూడా అలాగే అంటారా" అని అడిగాడు కుర్ర యజమాని. "ఓరి నీ డౌట్లు కూల... ఆళ్లు పెద్దోళ్లురా. అలాంటోళ్లకి ఈ రిజర్వేషన్లు అవసరం లేదు. ఆళ్లంతా ఎక్కడెక్కడో చదువుకుని తెలివితేటలతో మంత్రులవుతారు. లోకసభలోనూ, పెద్దల సభల్లోనూ ఇవి పనికిరావురా. మన పంచాయితీల్లాంటి పంచాయితీలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు వేలల్లో ఉంటాయి కదా దేశంలో. అక్కడ పెత్తనంకోసం అన్నమాట. పండక్కో, పబ్బానికో పట్టుచీర కొనిచ్చినట్లు పదవిలో ఇంటావిడ్ని కూర్చోపెట్టి మిగిలిదంతా భర్తలే చేసేస్తారు" అని కూడా అన్నారు. "అంతా భర్తలే చేసేస్తే ఇక రిజర్వేషన్లు ఎందుకండి" అని చాలా తెలివైన ప్రశ్న వేసినట్లుగా ఫీలయ్యాడు కుర్ర యజమాని. "ఓరేయ్ నువ్వు అర్జంట్‌గా కూరగాయల దుకాణం మూసేసి మీ ఆవిడ్ని రాజకీయాల్లో దింపేయ్. చాలా తెలివైన ప్రశ్నలు అడుగుతున్నావ్" అని మెచ్చుకుంటూనే.... "ఈ మహిళా రిజర్వేషన్లు ఎందుకంటే పురుషులు వెనుకనుంచి అధికారం అనుభవించడానికి. ఇది పురుషులకు పురుషులే చేసుకున్న మహోపకారం అన్నమాట" అన్నారు సుందర్రావ్. "అంటే 67 శాతం మంది పురుషులు సభల్లో నేరుగా కూర్చుని అధికారం అనుభవిస్తారు. 33శాతం మంది పురుషులు భార్యల్నో, అక్కల్నో, చెల్లెమ్మల్నో, తల్లుల్నో ముందు కూర్చోపెట్టి వెనుక నుంచి అధికారం అనుభవిస్తారన్నమాట. అంటే ఈ 33శాతం రిజర్వేషన్ వందశాతం పురుషుల రిజర్వేషన్ అన్నమాట. కదండి సర్పంచ్ వడ్డి గారు" అన్నాడు కుర్ర యజమాని. బెండకాయల్ని తూకం కూడా వేయించకుండా బ్యాగులో వేసుకుని డబ్బులు అడిగే అవకాశం కూడా ఇవ్వకుండా బెండకాయ బ్యాగ్‌తో విసవిస నడుచుకుంటు వెళ్లిపోయారు వడ్డి సూర్యనారాయణ.

ఫోన్: 912019929

కనీస వేతనాలు లేవు - గరిష్ట దోపిడి ఉంది...!

స్వాతంత్ర్యానికి ముందు వలస పాలనలో కనీస వేతనాలు, సమగ్ర చట్టం లేక యాజమాన్యాలు ఇష్టారాజ్యంగ కార్మికుల శ్రమను దోచుకునేవారు. అనేక పోరాటాల తర్వాత భారత ప్రభుత్వం 1948లో కనీస వేతనాల చట్టాన్ని తెచ్చింది. ఈ చట్టం ఉద్దేశం, చట్టంలో నిర్దేశించిన వేతనాల కన్న తక్కువ చెల్లించటం నేరం. యాజమాన్యాలు చెల్లించగల శక్తిని బట్టి ఎక్కువ వేతనం చెల్లించితే ఏలాంటి అభ్యంతరం ఉండదు. ఈ చట్టం లక్ష్యం చాలా స్పష్టంగా ఉంది. ప్రతి కార్మికుడు తన కుటుంబ జీవనానికి అయ్యే ఖర్చులు, పిల్లల చదువులు, వైద్యం, వినోదం, పెళ్ళిల్లు, వృద్ధ్యాప్య అవసరాలకు కావల్సిన డబ్బులు కార్మికుడికి వేతనం ద్వారా యాజమాన్యాలు చెల్లించాలి. ఉత్తమ జీవన ప్రమాణాలకు తగిన ఉపాధి కల్పించడం ప్రభుత్వానికి రాజ్యాంగం నిర్దేశించిన లక్ష్యాలలో ఒకటి. అదేరకంగా యాజమాన్యాలు కార్మికులను తమ ప్రయోజనాల కొరకు శ్రమ దోపిడీ చేయకుండా నిరోధించటం ప్రభుత్వ బాధ్యత అని కూడా రాజ్యాంగం ప్రకటించింది. అందుకే కార్మికులకు సాంఘిక న్యాయం కల్పించటానికి ఈ చట్టం తీసుకువచ్చారు. ఈ చట్టం అమలుకు కార్మికశాఖ అధికారులను నియమించారు. కానీ కేంద్రంలోని ప్రస్తుత మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలతో పాటు కనీస వేతనాల చట్టాన్ని కూడా సమూలంగా ఎత్తివేసి వేతనాల పర్యవేక్షకులుగా ఉన్న కార్మిక అధికారులను తీసివేసింది. మోదీ చేసిన చట్టాలు ఇంకా అమలుకాలేదు. ఒకవేళ మోదీ చట్టాలు అమల్లోకివస్తే వలస పాలనలో కార్మికులు అనుభవించిన బానిస వ్యవస్థను తలపించే కష్టాలను కార్మికులు చవిచూడవల్సి వస్తుంది.

గతంలో 3 సంవత్సరాలకొకసారి కనీస వేతనాలు సవరించాలనే నిబంధన ఉన్నప్పటికీ దానిని 5 సంవత్సరాలకు పెంచారు. ఈ చట్ట ప్రకారం మన రాష్ట్రంలో గుర్తించిన 72 షెడ్యూల్ పరిశ్రమలకు మాత్రమే కనీస వేతనాలు వర్తిస్తాయి. షెడ్యూల్‌లోలేని అనేక కొత్త పరిశ్రమలు, కార్ఖానాలు వచ్చినప్పటికీ అందులో పనిచేసే కార్మికులకు ఎలాంటి వేతన భద్రత లేదు. వారి పరిస్థితి దయనీయం. మన దేశానికి స్వాతంత్ర్యంవచ్చి 77 సంవత్సరాలు దాటినా కార్మికులకు డి.ఎ.తో కూడిన వేతనాలు చాలా చోట్ల లేవు. కనీస వేతనాల పెంపుదలకు 5 సంవత్సరాల కాలపరిమితి పెట్టినా అమల్లో 12 సంవత్సరాలు దాటినప్పటికీ, కనీస వేతనాల చట్టాలో ఎలాంటి మార్పు లేదు. కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా 14 సంవత్సరాలకు తెలంగాణ ప్రభుత్వం 5 పరిశ్రమలకు సంబంధించి కనీస వేతనాలు సవరించింది. కానీ కొంతమంది పారిశ్రామికవేత్తలు అభ్యంతరాల మూలంగా గజిట్‌లో ముద్రించి అమలు చేయకుండా నిలిపివేసింది. కనీస వేతన రంగంలో ఉన్న లక్షల మంది కార్మికులను ప్రభుత్వం లెక్కచేయకుండా పిడికెడు మంది పారిశ్రామికవేత్తల మాటలకు విలువ ఇవ్వటంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రమదోపిడి దారుల పక్షాన నిలబడింది. 5 జి.ఓ.లకు ఈ గతి పడితే 72 షెడ్యూల్ పరిశ్రమల్లో మిగిలిన వాటి పరిస్థితి అందులో పనిచేస్తున్న కార్మికుల గతి ఏమిటనేది కార్మికవర్గం అర్థం చేసుకోవాలి. ఈ మొత్తం అస్తవ్యస్థ వ్యవహారానికి ప్రభుత్వానిది బాధ్యత కాదా? ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఎన్నిసార్లు వేతనాలు పెంచుకున్నారో ఎంత పెంచుకున్నారో పరిశీలిస్తే వారి నైతికతను కార్మికులు ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. నిర్దిష్టమైన కనీస వేతనాలు లేక బాధపడుతుంటే ప్రభుత్వాలు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, స్కీం వర్కర్లు, పార్ట్‌టైం వర్కర్ లాంటి అనేక విధానాలు ప్రవేశపెట్టి కార్మికులకు భద్రతలేని ఉద్యోగం, తక్కువ వేతనాలు పొందే వ్యవస్థను ప్రవేశపెట్టారు. 1970 కాంట్రాక్టు చట్ట ప్రకారం కూడా పర్మినెంట్ లక్షణాలు కలిగిన ఉద్యోగాల్లో కాంట్రాక్టు ఇతర పేర్లతో కార్మికులను నియమించటం నిషేధించడమైంది. ఆ చట్ట ప్రకారం ఒక కార్మికుడు 240 రోజులు కాంట్రాక్టు విధానంలో పని చేస్తే ఖచ్చితంగా పర్మినెంట్ చేయాలని చట్టం చెపుతుంది. కాంట్రాక్ట్ చట్టంలోని ఈ నిబంధనలు ఎక్కడా అమలు జరగటంలేదు. కార్మికులకు కనీస వేతనాలు సవరించకుండా, కాంట్రాక్టు విధానాన్ని విచ్చలవిడిగా అమలుచేస్తూ ప్రభుత్వాలు రాజ్యాంగ స్ఫూర్తిని మంటకలిపి శ్రమదోపిడీకి పచ్చజెండా ఊపుతున్నది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన 10వ పే కమీషన్ సిఫార్సుల ప్రకారం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు 19వేలు కనీస వేతనం చెల్లించాలని, ప్రతి సంవత్సరం 10శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, 3 సంవత్సరాల తర్వాత పై గ్రేడ్‌కు ప్రమోషన్ ఇవ్వాలని సిఫార్సు చేసింది. కానీ ప్రభుత్వం పర్మినెంట్ కార్మికులకు పే

కమీషన్ సిఫార్సులు అమలుచేసి కాంట్రాక్టు కార్మికులకు మొండిచేయి చూపించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను ఉపేక్షిస్తూ, 2016లో సుప్రీంకోర్టు చెప్పినట్లు, 1976 చట్టం ప్రకారం సమానపనికి సమానవేతనం చెల్లించకుండా, కమిటీలు ఇచ్చిన సిఫార్సులు అమలు చేయకుండా, న్యాయబద్ధమైన కనీస వేతనాలు పెంచకుండా, కార్మికుల శ్రమను విశృంఖలంగా పారిశ్రామిక వేత్తలు దోచుకోవటానికి అవకాశాలు సృష్టించారు.

దోచుకోవటానికి కాంట్రాక్ట్ / ఔట్‌సోర్సింగ్ లాంటి విధానాలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెట్టి వాటి అమలుకు కార్మికులను నియమించుకున్నారు. వారికి పెట్టిన ముద్దు పేరు స్కీం వర్కర్లు. వారికి చెల్లించే వేతనం పేరు గౌరవ వేతనం. ఇది ప్రస్తుత కాలంలో ప్రజా ప్రతినిధులు లక్షల జీతాలు తీసుకుంటూ వీరికి వేలల్లో జీతాలు చెల్లించటం హాస్యాస్పదం. పదవీవిరమణ పొందిన స్కీం వర్కర్లకు 1972 గ్రాట్యుటీ చట్ట ప్రకారం ఎలాంటి గ్రాట్యుటీ, పెన్షన్ లేకుండా ఉట్టి చేతులతో, కన్నీళ్ళతో ఇంటికి చేరవల్సిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో ప్రజాసేవ చేస్తానని ముందుకు వచ్చిన రాజకీయ నాయకులు అప్పనంగా పెన్షన్ పొందుతున్నారు. ప్రజాసేవ పేరుతో రాజకీయాలు చేస్తున్న వారికి జీవనం కోసం స్కీంవర్కర్‌గా పనిచేస్తున్న వారికి ఉన్న వ్యత్యాసం పరిశీలిస్తే ఎక్కడా ఇలాంటి పరిస్థితి కనిపించదు

కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న కార్మికులకు పర్మినెంట్ కార్మికులకన్న తక్కువ వేతనం చెల్లించటం, స్కీం వర్కర్లకు వేతన వ్యవస్థ లేకుండా చేయటం, కొత్తగా గిగ్ వర్కర్ల వ్యవస్థను సృష్టించి ఎలాంటి రక్షణాలేని, ఎవరూ బాధ్యత వహించని పరిస్థితికి ప్రభుత్వాలు బాధ్యత వహించకుండా వీరి శ్రమదోపిడితో దేశాభివృద్ధి / సమాజాభివృద్ధి చేయాలనుకోవటం పాలకుల దుష్టబుద్ధికి పరాకాష్ట. ఇలాంటి దుష్ట సంస్కృతికి, దోపిడీ సమాజానికి ప్రభుత్వాలే బాధ్యత వహించాలి. ఎన్నికల సమయంలో కాంట్రాక్టు విధానం రద్దుచేస్తామన్న ప్రభుత్వాలు రద్దు చేయకపోగా కొత్త నియామకాలు కూడా కాంట్రాక్టు పద్ధతిలో నియమించటం పాలకుల బరితెగింపుకు నిదర్శనం. నైపుణ్యంలేని కార్మికుల నుండి అతి నైపుణ్యం కలిగిన కార్మికుని వరకు ఇంజనీర్, డాక్టర్, టీచర్, ప్రొఫెసర్ అనే తేడా లేకుండా విద్య, వైద్యం, సేవా, ఉత్పత్తి లాంటి అన్ని రంగాలు అన్ని చోట్ల కాంట్రాక్ట్ విధానం దర్శనమిస్తూ తన వికృత రూపాన్ని ప్రదర్శిస్తూ సభ్య సమాజాన్ని ప్రశ్నిస్తున్నాయి.

వి.యస్.బోస్
ఏఐటీయూసీ తెలంగాణ మాజీ ప్రధాన కార్యదర్శి
ఫోన్: 9391356527

నీరు ఇవ్వడానికి ఒప్పుకోం

కర్నాటక వ్యాప్తంగా 'కావేరి' నిరసనలు

బెంగళూరు : తమిళనాడుకు 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని రాష్ట్రాన్ని ఆదేశిస్తూ కావేరీ జలాల నిర్వహణ మండలి, నియంత్రణ కమిటీ ఆదేశాలపై జోక్యం చేసుకోవడానికి సుప్రీం కోర్టు గురువారం నిరాకరించడంతో శుక్రవారం కర్నాటకలోని వివిధ ప్రాంతాల్లో నిరసనలు కొనసాగాయి. కావేరి నదీ పరివాహక జిల్లాలైన మైసూరు, మాండ్య, చామరాజనగర, రామనగర, బెంగళూరు తదితర ప్రాంతాల్లో రైతు సంఘాలు, కన్నడ అనుకూల సంఘాలు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ పొరుగు రాష్ట్రానికి నీరు విడుదల చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాయి. వర్షాకాలంలో లోటు వర్షాల కారణంగా నీటి ఎద్దడి ఏర్పడిందని, కావేరీ పరీవాహక ప్రాంతాల్లో తాగు, సాగు నీటి అవసరాలను పరిగణనలోకి తీసుకుని నీటిని విడుదల చేసే పరిస్థితి లేదని కర్నాటక వాదిస్తోంది. చిత్రదుర్గ, బళ్లారి, దావణగెరె, కొప్పల్, విజయపుర జిల్లాలకు కూడా నిరసనలు వ్యాపించాయి. మాండ్యలోని ఎం.విశ్వేశ్వరయ్య విగ్రహం దగ్గర రైతు హితరక్ష సమితి అధ్వర్యంలో రైతులు నిరసన కొనసాగించారు. ఈ నిరసనల్లో వారితో పాటు కావేరి బెల్ట్ అయిన పాత మైసూరు ప్రాంతంలోని ప్రముఖ ఆధ్మాతిక వేదిక అయిన ఆదిచుంచనగిరి మఠం అధిపతి నిర్మలానందనాథ స్వామిజీ కూడా చేరారు. ఆందోళన చేస్తున్న రైతులను ఉద్దేశించి మఠాధిపతి ప్రసంగిస్తూ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వాస్తవాలను సుప్రీం కోర్టు ముందు ఉంచి రాష్ట్ర రైతుల, ప్రజల ప్రయోజనాలను కాపాడాలన్నారు. రైతుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులతో మాట్లాడతానని చెప్పారు. 'త్వరగా ఒక కరవు విధానం (నీటి భాగస్వామ్యం కోసం) అవసరం' అని అన్నారు. బెంగళూరులోని కేఆర్ పురంలో ప్రవీణ్ శెట్టి నేతృత్వంలో కర్నాటక రక్షణ వేదిక కార్యకర్తలు రహదారిని దిగ్బంధించి నిరసన చేపట్టారు. ఆయనతో పాటు అనేక మంది కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని తరలించారు. న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, రోడ్లు దిగ్బంధించి, టైర్లు, దిష్టిబొమ్మలను దహనం చేస్తూ రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో నిరసనలు చేపట్టారు. బెంగళూరు నగరానికి నీటిని సరఫరా చేసే మాండ్యలోని తొరే కాదనహళ్లి (టికె హళ్లి) పంపింగ్ స్టేషన్‌ను కొన్ని కన్నడ సంస్థలు ముట్టడించాయి. కావేరి నిరసనకు అక్కడ నుంచి మద్దతు లభించకపోవడంతో రాజధాని నగరానికి నీటి సరఫరాను నిలిపివేయాలని అధికారులను కోరారు. ఘటనా స్థలంలో పోలీసు బృందాలను మోహరించారు. పార్టీ అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించేందుకు బీజేపీ కర్నాటక నేతలు బెంగళూరులో మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై నేతృత్వంలో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి కావేరి పరివాహక జిల్లాల పార్టీ అధ్యక్షులు, నాయకులు హాజరయ్యారు. కావేరి అంశంలో ప్రభుత్వం విఫలమైందని, దాని పర్యవసానాలు కనిపిస్తున్నాయని స్పష్టం చేసిన బొమ్మై, 'నేను (కోర్టు) విచారణలను చూశాను. మా న్యాయవాదులు సమర్థవంతంగా వాదించగలరు' అని ఆయన అన్నారు. ట్రిబ్యునల్ ఉత్తర్వులు, బెంగళూరు నీటి అవసరాలు, తమిళనాడులో రానున్న రుతుపవనాలు, పొరుగు రాష్ట్రం నీటి వినియోగంపై న్యాయవాదులు సూచనలు చేయలేదని, ఇది కర్ణాటకకు నష్టం కలిగిస్తోందని ఆయన అన్నారు. ఈ విషయాన్ని పదేపదే ప్రభుత్వానికి ఎత్తిచూపడం వల్ల ప్రయోజనం లేదని, ప్రజలకు అవగాహన కల్పించడమే ఇప్పుడు మార్గమని బొమ్మై అన్నారు. బీజేపీలో చర్చిస్తున్నామని, మాండ్య, మైసూరు, రామనగర, చామరాజనగర, హాసన్‌లలో ఒక దఫా చర్చ జరిగిందని ఆయన తెలిపారు. అక్కడతో పాటు బెంగళూరులోనూ నిరసనలు తెలుపుతాం. సమావేశంలో మేము చర్చించి కార్యాచరణ ప్రణాళికను నిర్ణయిస్తాము' అని అన్నారు. గత వారం సీడబ్ల్యూఆర్‌సీ అటువంటి సిఫార్సు చేసిన తర్వాత మరో 15 రోజుల పాటు తమిళనాడుకు 5 వేల క్యూసెక్కుల నీటి విడుదలను కొనసాగించాలని సీడబ్ల్యూఎంఏ సోమవారం కర్నాటకను కోరింది.

సిగరెట్ వినియోగానికి మరింత డిమాండ్

ముంబై : స్థిరమైన పన్ను విధానంతో పాటు అధిక సంఖ్యలో శ్రామికశక్తి కార్యాలయాలకు తిరిగి రావడంతో ఈ ఆర్థిక సంవత్సరంలో సిగరెట్ డిమాండ్ 7-9 శాతం పెరిగే అవకాశం ఉందని ఒక నివేదిక పేర్కొంది. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో కోవిడ్ మహమ్మారి తర్వాత గత ఆర్థిక సంవత్సరంలో సిగరెట్ వినియోగం 18 శాతం పుంజుకుందని క్రిసిల్ రేటింగ్స్ నివేదిక గురువారం తెలిపింది. ఇది మరింత ముందుకు వెళు తున్నప్పుడు వృద్ధి దీర్ఘకాలిక సగటు 5 శాతానికి చేరువయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. మరోవైపు, ఉత్పత్తిదారుల లాభదాయకత 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉత్పాదక ఖర్చు ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, వారు ప్రీమియం సిగరెట్‌లపై దృష్టి సారించడం, ఎంపిక చేసిన వర్గాల్లో ధరలను పెంచడం వంటివి బలంగానే ఉంటాయని నివేదిక పేర్కొంది. క్రిసిల్ రేటింగ్స్ డైరెక్టర్ ఆనంద్ కులకర్ణి మాట్లాడుతూ సిగరెట్ వినియోగాన్ని నడపడంలో పని ప్రదేశాల్లో భౌతిక హాజరు ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. కార్యాలయాల్లో ఉద్యోగ, కార్మికుల భౌతిక హాజరు గత ఆర్థిక సంవత్సరం 40 శాతం నుంచి ఈ ఆర్థిక సంవత్సరంలో 65-70 శాతంగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు, డిమాండ్‌పై భారీ ప్రభావం చూపే పన్ను విధానంలో స్థిరత్వం కూడా వృద్ధికి తోడ్పడుతుందని ఆయన తెలిపారు. ఎక్సైజ్ సుంకం, వస్తువులు, సేవల పన్నుతో సహా లెవీలలో గణనీయమైన పెరుగుదల 2013, అలాగే 2018 ఆర్థిక సంవత్సరాల్లో వ్యవస్థీకృత సిగరెట్ అమ్మకాల వాటాను తగ్గించింది.

మహిళా రిజర్వేషన్లలో కోటా కోరుతూ

నేడు ఓబీసీ నాయకుల సమావేశం

బీజేపీ నాయకురాలు ఉమాభారతి

భోపాల్ : ఇటీవల ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీలకు కోటా కల్పించేందుకు మార్గాలను అన్వేషించడానికి ఇతర వెనుకబడిన తరగతుల నాయకులు శనివారం 'భారీ' సమావేశానికి అంగీకరించారని మధ్య ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నాయకురాలు ఉమాభారతి శు క్రవారం పేర్కొన్నారు. అయితే సెప్టెంబరు 23న ఓబీసీ నేతల సమావేశం జరిగే సమయం, వేదిక వివరాలను వివరించలేదు.

దౌత్యపరంగా విస్తృతంగా చర్చించాలి

భారత్-కెనడా వివాదంపై జైరాం రమేశ్

న్యూఢిల్లీ: ఖలిస్తానీ వేర్పాటువాది హత్యతో భారత్‌ను ముడిపెడుతూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడ్యూ చేసిన ఆరోపణలు తీవ్ర పరిణామాలకు దారితీశాయి.

కెనడా, భారత్ మధ్య సంబంధాలు బీటలు వారాయి. రెండుదేశాలు పరస్పరం దౌత్యాధికారులపై వేటు వేశాయి. కెనడా పౌరులకు వీసాలను భారత్ తాత్కాలికంగా నిలిపివేసింది. అయితే ఇటువంటి తీవ్రమైన సంక్షోభాన్ని విస్తృతంగా చర్చించడం ద్వారానే పరిష్కరించగలమని కాంగ్రెస్ పేర్కొంది. కెనడాలోని భారతీయుల భద్రతకు హామీ ఉండేలా చూసుకోవాలని తెలిపింది. ఇదే అంశంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ భారత సమగ్ర, సార్వభౌత్వం, ఐక్యతకు ముప్పు ఉన్నప్పుడు ఉగ్రవాదంపై రాజీలేని పోరాటం చేయాలని నొక్కిచెప్పారు. రెండు దేశాల మధ్య సంక్షోభాన్ని పరిష్కరించడం కోసం దౌత్యపరంగా చర్చలను విస్తృతంగా జరపాలని ఆయనన్నారు.

ఈవీఎం సోర్స్‌కోడ్‌పై ఆడిట్ కుదరదు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో ఉపయోగించిన సాఫ్ట్‌వేర్‌పై ఆడిట్ చేయాలన్న పిటిషన్ విచారణకు సుప్రీంకోర్టు శుక్రవారం నిరాకరించింది. నిబంధనలు ఉల్లంఘించినట్లు చూపించే ఆధారాలేవీ పిటిషనర్ సమర్పించలేదని పేర్కొంది. ఈవీఎం సోర్స్‌కోడ్‌పై ఆడిట్ నిర్వహించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం పరిశీలించింది. అనంతరం ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. ఎన్నికల నియంత్రణ బాధ్యతను కేంద్ర ఎన్నికల కమిషన్‌కు అప్పగించారని, అయితే, ఎన్నికల సంఘం నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిందని చెప్పడానికి ఎటువంటి ఆధారాలను పిటిషనర్ కోర్టుకు సమర్పించలేదని సుప్రీం ధర్మాసనం స్పష్టంచేసింది. ముఖ్యంగా ఈవీఎంలపై అనుమానాలు కలిగించే ఏ సమాచారాన్ని ఇవ్వలేదని వ్యాఖ్యానించింది. కొన్నేళ్ల క్రితం బ్యాలెట్ స్థానంలో తీసుకువచ్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలతో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తోంది. అయితే, వాటి పనితీరుపై కొందరు అనేక సందర్భాల్లో అనుమానాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో ఈవీఎంలలో ఉపయోగించిన సోర్స్ కోడ్‌పై ఆడిట్ చేపట్టాలని కోరుతూ సునీల్ ఆహ్యా అనే వ్యక్తి ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. 'సోర్స్ కోడ్ అనేది ఈవీఎంకు ఎంతో కీలకమని, ఇది ప్రజాస్వామ్య మనుగడకు సంబంధించినదని అందులో పేర్కొన్నారు.

'సనాతన ధర్మం' వ్యాఖ్యలపై సుప్రీం నోటీసులు

తమిళనాడు సర్కార్, మంత్రి ఉదయనిధి స్పందన కోరిన కోర్టు

న్యూఢిల్లీ : 'సనాతన ధర్మాన్ని నిర్మూలించండి' అంటూ తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ దాఖలయిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు శుక్రవారం తమిళనాడు ప్రభుత్వం, అలాగే మంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రతిస్పందన కోరింది. తమిళనాడు మంత్రి వ్యాఖ్యలు ద్వేషపూరిత ప్రసంగంలా ఉన్నాయని, ఇలాంటి విషయాల్లో సుప్రీం కోర్టు అనేక ఆదేశాలు జారీ చేసిందని, దీనిపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయాలని కోరుతూ బి.జగన్నాథ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అనిరుద్ధ బోస్, బేల ఎం త్రివేదితో కూడిన ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపిస్తూ... ఈ మతం మంచిది కాదని, ఇతర మతం మంచిదని పాఠశాల విద్యార్థులను మంత్రి అడిగారని తెలిపారు. వ్యక్తులు వేరొకరి విశ్వాసానికి వ్యతిరేకంగా అలాంటి ప్రకటన చేస్తే ఇలాంటి విషయాలను ఈ కోర్టు గమనించింది. అయితే ఈ సందర్భంలో అది ఒక మంత్రి ప్రకటన చేయడం. ఇక్కడ ఇది ఒక రాష్ట్రం, ఇది పాఠశాల విద్యార్థులకు మతం తప్పు అని చెబుతోంది' అని న్యాయవాది నాయుడు అన్నారు. కాగా, న్యాయస్థానం నుంచి మీరు ఏమి కోరుతున్నారు అని ధర్మాసనం పిటిషనర్ తరపు న్యాయవాదిని ప్రశ్నించింది. దీనికి సీనియర్ న్యాయవాది మంత్రి (స్టాలిన్) అటువంటి ప్రకటన చేయకుండా నిరోధించాలని, రెండవది ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతున్నారని చెప్పారు. 'విద్యార్థులను దీని నుంచి దూరంగా ఉంచాలని మేము కూడా కోరుతున్నాము' అని ఆయన చెప్పారు. 'మేము నోటీసు జారీ చేస్తున్నప్పటికీ, మీరు ఎఫ్ఐఆర్ నమోదు కోసం సంప్రదించడం ద్వారా సుప్రీం కోర్టును పోలీసు స్టేషన్‌గా మారుస్తున్నారు. మీరు హైకోర్టుకు వెళ్లి ఉండాల్సింది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆయన మంత్రిగా ఉన్నందున తాము కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని, ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు తాము వెళ్లినప్పుడు ఎవరూ నమోదు చేయలేదని న్యాయవాది నాయుడు తెలిపారు.

మళ్లీ 25న విచారిస్తాం: సుప్రీం

ఆయుధాల రికవరీపై మణిపూర్ స్టేటస్ రిపోర్టు దాఖలు

న్యూఢిల్లీ: హింస పీడిత ఈశాన్య రాష్ట్రంలోని అన్ని వర్గాల నుంచి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు మణిపూర్ ప్రభుత్వం శు క్రవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ మేరకు స్టేటస్ రిపోర్టు దాఖలు చేసింది. ఈ వ్యవహారాన్ని సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వ జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించగా కేంద్రం, మణిపూర్ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. స్టేటస్ రిపోర్టు కేవలం జడ్జిల వినియోగం కోసమే దాఖలు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో మహిళలు, పిల్లలపై లైంగిక హింసతో ముడిపడ్డ కేసులకు సంబంధించిన 11 ఎఫ్ఐఆర్‌లపై చేపట్టిన దర్యాప్తు గురించి వివరాలను సీబీఐ తెలపాలనేదానిపై సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ క్రిమినల్ కేసుల్లో దర్యాప్తును పర్యవేక్షించేందుకు ఐపీఎస్ అధికారి దత్తాత్రేయ పద్సాగికర్‌ను ప్రత్యేకంగా నియమించినట్లు వెల్లడించింది. బాధ్యతలు చేపట్టేందుకు, పరిస్థితిని సమీక్షించేందుకు అధికారికి కొంత సమయమిచ్చిన తర్వాత స్టేటస్ రిపోర్టు కోరవచ్చని పేర్కొంది. నియమిత అధికారి మహారాష్ట్రలో మంచి పేరున్న అధికారని, ఆ రాష్ట్ర మాజీ డీజీపీ కూడా అని సీజేఐ తెలిపారు.

ఆయుధాల రికవరీపై నివేదిక సమర్పణతో పాటు ఇదే వ్యవహారంలో షార్ట్ అఫిడవిట్ ఉందని మెహతా వెల్లడించారు. ప్రస్తుతం చర్చించే అంశాలన్నీ సర్వోన్నత న్యాయస్థానం నియమిత కమిటీ దృష్టికి వెళ్లినట్లు అందులో ఉందని చెప్పారు. తదుపరి దర్యాప్తును ఈనెల 25వ తేదీన జరుపవచ్చని, ఈలోగా స్టేటస్ రిపోర్టును, అఫిడవిట్‌ను న్యాయస్థానం పరిశీలించవచ్చని సూచించారు.

ధర్మాసనం స్పందిస్తూ అఫిడవిట్‌ను పిటిషనర్లతో పంచుకోవచ్చుగానీ స్టేటస్ రిపోర్టు కాదని పేర్కొంది. కాగా, పిటిషనర్ల తరపున న్యాయవాది బృందా గ్రోవర్ వాదిస్తూ మే 4న సామూహిక అత్యాచారం, హత్యకు గురైన ఇద్దరు మహిళల మృతదేహాలను వారి కుటుంబాలకు ఇప్పటివరకు అప్పగించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నోడల్ అధికారులను, కమిటీనీ ఆశ్రయించినా ఫలితం లేదని చెప్పారు. దీనిపై మెహతా స్పందిస్తూ దీనిని కమిటీ పరిగణనలోకి తీసుకుంది, అధికారులకు కొన్ని ఆదేశాలివ్వగా అవి అమలయ్యాయి అని చెప్పారు.దర్యాప్తు వివరాలను సీబీఐ ఇవ్వడం లేదని పిటిషనర్ల తరపున మరో సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ అన్నారు. కోర్టు నియమిత కమిటీపై ధర్మాసనం నమ్మకంగా ఉందని మెహతా స్పందించగా, అధికారి విషయంలో తామేమీ మాట్లాడటం లేదని, కేసు విచారణ తాజా వివరాలు అందడం లేదని మాత్రమే చెబుతున్నామని జైసింగ్ తెలిపారు.

అయితే కోర్టు నియమిత కమిటీ తన నివేదికలో కొన్ని సిఫార్సులు చేసినట్లు న్యాయవాదుల్లో ఒకరు కోర్టుకు తెలిపారు. రెండు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం... కమిటీ నివేదిక, మణిపూర్ ప్రభుత్వ అఫిడవిట్‌పై కొన్ని ఆదేశాలను జారీచేస్తూ తదుపరి విచారణను 25వ తేదీకి వాయిదా వేసింది.

ఎన్డీయేలోకి జేడీఎస్

నడ్డా, షాతో కుమారస్వామి భేటీ

న్యూఢిల్లీ : 2024 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కర్నాటకలో బీజేపీకి ఊతమిచ్చేలా జనతా దళ్ (సెక్యులర్) పార్టీ అధినేత హెచ్‌డి కుమారస్వామి... కేంద్రం హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డాతో సమావేశం తరువాత పార్టీతో పొత్తు పెట్టుకోవాలని నిర్ణయించారు. సమావేశం తర్వాత, నడ్డా సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో పోస్ట్‌లో... నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్‌లో భాగంగా ఉండాలని నిర్ణయించుకున్నందుకు నేను సంతోషంగా ఉన్నాను. ఎన్డీయేలోకి వారిని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం. ఇది మా కూటమిని మరింత బలోపేతం చేస్తుంది. 'న్యూ ఇండియా, స్ట్రాంగ్ ఇండియా' కోసం గౌరవప్రదమైన ప్రధాని నరేంద్ర మోదీకి చెందిన దృష్టి' అని పేర్కొన్నారు. మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ నేతృత్వంలో కాంగ్రెస్, బీజేపీ రెండు ప్రధాన పార్టీలుగా ఉన్న దక్షిణాది రాష్ట్రంలో జేడీ(ఎస్) చాలా కాలంగా బలమైన మూడవ పార్టీగా ఉంది. అయితే, ఈ ప్రాంతీయ పార్టీ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో భారీ ఓటమిని చవిచూసింది. కాంగ్రెస్ భారీ విజయాన్ని సాధించగా, బీజేపీని మూడవ స్థానానికి తగ్గించింది. సాంప్రదాయకంగా కాషాయ పార్టీ బలహీనంగా ఉన్న దక్షిణ కర్నాటకలో ప్రాంతీయ పార్టీ గణనీయమైన ప్రభావాన్ని కలిగి ఉన్నందున, 2024 లోక్‌సభ ఎన్నికలలో జేడీ(ఎస్) తో పొత్తు తమ ఆధిపత్యాన్ని నిర్ధారిస్తుందని బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ విశ్వసిస్తోంది.

భారతీయ శాస్త్రవేత్త స్వాతికి బోర్లాగ్ అవార్డు

వాషింగ్టన్: అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఆర్ఆర్ఐ)కు చెందిన భారతీయ శాస్త్రవేత్త డాక్టర్ స్వాతి నాయక్‌కు 2023 ఏడాదికిగాను క్షేత్ర పరిశోధన, అన్వయాలకుగాను నార్మన్ బోర్లాగ్ అవార్డును ప్రకటించారు. ఆమె అద్వితీయ యువ శాస్త్రవేత్త అని రాక్ ఫెల్లర్ ఫౌండేషన్ నిధులతో నడిచే వరల్డ్ ఫుడ్ ప్రైజ్ ఫౌండేషన్ ప్రశంసించింది. డాక్టర్ స్వాతి దిల్లీ ఐఆర్ఆర్ఐ కేంద్రంలో విత్తన పరిశోధన విభాగాధిపతిగా పనిచేస్తున్నారు. వరిపంట సాగుచేసే చిన్న రైతులకు అందించిన సేవలకుగాను ఆమెకు ఈ అవార్డు ప్రకటించినట్లు వరల్డ్ ఫుడ్ ఫౌండేషన్ ఎక్స్ ద్వారా తెలిపింది. హరిత విప్లవ పితామహుడు, నోబెల్ గ్రహీత నార్మన్ ఇ.బోర్లాగ్ పేరిట నెలకొల్పిన ఈ అవార్డును ఆకలిని నిర్మూలించి ఆహార భద్రతను సాధించడానికి తోడ్పడే 40 ఏళ్లలోపు యువ శాస్త్రవేత్తలకు ఇస్తారు.

పరువునష్టం కేసులో తేజస్వికి సమన్లు

అహ్మదాబాద్: క్రిమినల్ పరువునష్టం దావా కేసులో బీహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌కు అహ్మదాబాద్‌లోని మెట్రోపాలిటన్ కోర్టు శుక్రవారం రెండోసారి సమన్లు జారీ చేసింది. మొదటిసారి పంపిన సమన్లు ఆయనకు చేరకపోవడంతో తాజాగా పంపింది. తాజా సమన్ల ప్రకారం అక్టోబరు 13న తేజస్వి కోర్టు ముందు హాజరు కావాల్సి ఉంది. గుజరాతీయులే దోపిడీదారులని వ్యాఖ్యానించినందుకుగాను తేజస్విపై పరువునష్టం దావా వేశారు. ఈ కేసులో అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ డీజే పర్మార్ ఆగస్టు 28న తేజస్వికి సమన్లు జారీ చేశారు. సెప్టెంబరు 22న కోర్టు ముందుకు రావాలని ఆదేశించారు. ఈ కేసు నేడు విచారణకు రావడంతో తేజస్వికి సమన్లు అందలేదన్న విషయం బయటపడింది. దీంతో ఫిర్యాదుదారుడు హరేశ్ మెహతా స్వయంగా తేజస్వికి సమన్లు అందజేసే బాధ్యత తీసుకుంటారని మేజిస్ట్రేట్ తెలిపారు. ఈ సమన్లు తేజస్వికి అందజేయాల్సిన బాధ్యత తీసుకోవాలని మెహతాను ఆదేశించారు.

సుస్థిర ప్రభుత్వం వల్లే మహిళా బిల్లు ఆమోదం : మోదీ

న్యూఢిల్లీ : మహిళా రిజర్వేషన్ బిల్లు సాధారణ చట్టం కాదని, నవభారత ప్రజాస్వామ్య నిబద్ధతకు ఒక నిదర్శనమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శు క్రవారం అన్నారు. పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించినందుకు తనను అభినందించేందుకు బీజేపీ మహిళా మోర్చా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించిన మోదీ... కేంద్రంలో సంపూర్ణ మెజారిటీతో బలమైన ప్రభుత్వం ఆవశ్యకతను నొక్కి చెబుతూ, దీని ద్వారానే ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లు ఆమోదం పొందిందని తెలిపారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం గురించి దాదాపు మూడు దశాబ్దాలుగా మాట్లాడుతున్నారని, అంతకుముందు చేసిన ప్రయత్నాలకు నిబద్ధత లేదని, మహిళలు కూడా అవమానానికి గురయ్యారని అన్నారు. మహిళా సాధికారత కోసం తమ ప్రభుత్వం కృషి చేసిందని, ఈ క్రమంలోనే దశాబ్ద కాలంలో మహిళలు ఒక శక్తిగా ఎదిగారని, అందుకే పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రతులను చించివేసే రాజకీయ పార్టీలు దానికి మద్దతివ్వాల్సి వచ్చిందని మోదీ అన్నారు. సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పీ), రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) వంటి పార్టీలను ఎద్దేవా చేస్తూ అన్నారు. బిల్లును ఆమోదించే అవకాశం తమ ప్రభుత్వానికి లభించడం బీజేపీ అదృష్టమని ప్రధాని అన్నారు. కొన్ని నిర్ణయాలు ఒక దేశం విధిని మార్చగల శక్తిని కలిగి ఉన్నాయని, ప్రతిపాదిత చట్టాన్ని మహిళల్లో కొత్త విశ్వాసాన్ని నింపే, ముందుకు సాగడానికి భారతదేశ శక్తిని గుణించే ఒక చర్యగా ఆయన అన్నారు. సెప్టెంబరు 20, 21 తేదీల్లో కొత్త చరిత్ర సృష్టించిందని, ముందుగా లోక్‌సభ, ఆ తర్వాత రాజ్యసభలో బిల్లును ఆమోదించిన రోజులను మోదీ ప్రస్తావించారు. పూర్తి మెజారిటీ ఉన్న బలమైన, స్థిరమైన, నిర్ణయాత్మక ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకోవడం వల్ల ఇది సాధ్యమైందని ప్రధాని నొక్కి చెప్పారు. మహిళల నేతృత్వంలోని అభివృద్ధిలో కొత్త శకానికి నాంది పలుకుతామన్న మోదీ హామీని నెరవేర్చేందుకు ఇదే నిదర్శనమని, బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో హాజరైన మహిళల హర్షధ్వానాల మధ్య ఆయన అన్నారు. మహిళల సంక్షేమం కోసం తన ప్రభుత్వం అనేక పథకాలు, నిర్ణయాలను ఉటంకిస్తూ, వారి భద్రత, గౌరవం, శ్రేయస్సు కోసం కార్యక్రమాలతో వారి సంకెళ్లను విడదీయడానికి అన్ని ప్రయత్నాలు చేశామని ప్రధాని మోదీ తెలిపారు.

అభిషేక్ బెనర్జీకి ఊరట

నోయిడా: పశ్చిమ బెంగాల్‌లో జరిగిన పాఠశాల ఉద్యోగాల కుంభకోణం కేసులో తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ బెనర్జీపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని కలకత్తా హైకోర్టు శుక్రవారం ఈడీని ఆదేశించింది. దీంతో అభిషేక్ బెనర్జీకి స్వల్ప ఊరట లభించినట్లు అయింది. అయితే, బెనర్జీపై ఈడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌తో సమానమైన ఎన్‌ఫోర్సుమెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు(ఈసీఐఆర్)ను కొట్టివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈసీఐఆర్ ఆధారంగా తృణమూల్ ఎంపీ అభిషేక్ బెనర్జీపై కఠినచర్యలు తీసుకోవద్దని జస్టిస్ తీర్థాంకర్ ఘోశ్ ధర్మాసనం ఈడీకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అదేసమయంలో బెనర్జీ అరెస్టుకు ఈడీ సరైన ఆధారాలు సమర్పించలేకపోయిందని పేర్కొంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలకు సంబంధించి బెనర్జీపై దర్యాప్తు కొనసాగించవచ్చని తెలిపింది. ఉపాధ్యాయుల నియామక కుంభకోణం కేసులో అభిషేక్ బెనర్జీని ఈడీ ఇంతకుముందు 9 గంటలకు పైగా విచారించింది. హైకోర్టు తీర్పును తృణమూల్ కాంగ్రెస్ స్వాగతించగా ప్రతిపక్ష సీపీఎం, కాంగ్రెస్ స్పందించడానికి నిరాకరించాయి.

రాజకీయ లబ్ధికే మహిళా బిల్లు

- తక్షణమే అమలు చేయండి
- జనగణన, నియోజకవర్గాల పునర్విభజనతో లింకు వద్దు
- చిత్తుశుద్ధి ఉంటే అమలు సాధ్యమే: రాహుల్

న్యూదిల్లీ: మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. ఈ బిల్లులో ఓబీసీలను కలపకపోవడం నూటికినూరు శాతం బాధాకరమని వ్యాఖ్యానించారు. దేశంలో కులగణన చేపట్టాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఇప్పుడు చేపట్టే కులగణనతో పాటు యూపీఏ హయాంలో చేపట్టిన కులగణన వివరాలను బహిర్గతం చేయాలని మోదీ సర్కారుకు విజ్ఞప్తి చేశారు. కేవలం రాజకీయ కారణాలతోనే మోదీ ప్రభుత్వం ఇంత హడావుడిగా మహిళా బిల్లును తెరపైకి తీసుకొచ్చిం దని విమర్శించారు. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన అంశాలు ముడిపెట్టడంతో మహిళా బిల్లు రానున్న పదేళ్ల వరకు అమలయ్యే పరిస్థితే కనిపించడం లేదని అభిప్రాయపడ్డారు. కులగణనకు పెరుగుతున్న డిమాండ్ నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే ఈ బిల్లు తీసుకొచ్చినట్లు ఆరోపిం చారు. రాహుల్‌గాంధీ శు క్రవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో మాట్లాడుతూ మోదీ సర్కారు విన్యాసాలను వివరించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన మహిళా రిజర్వేషన్ల బిల్లును ఉభయసభలు ఆమో దించిన విషయం తెలిసిందే. అయితే జనగణన, నియో జక వర్గాల పునర్విభజన తర్వాతే దీనిని అమల్లోకి తెస్తామని కేంద్రం స్పష్టం చేసింది. ఈ అంశంపై రాహుల్ గాంధీ స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకురావడం మంచిదేనని, అయితే జనగణన, నియోజకవర్గాల పునర్విభజనకు ఏళ్ల తరబడి సమయం పడుతుందని చెప్పారు. 'మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయొచ్చు. ఇది సంక్లిష్టమైన విషయం కాదు. కానీ, కేంద్ర ప్రభుత్వం అలా చేయదలుచుకోలేదు. దీని అమలును జన గణన, నియోజకవర్గాల పునర్విభ జనతో ముడి పెట్టింది. ఈ బిల్లు పదేళ్ల తర్వాత అమలవుతుందని కేంద్రం చెప్పింది. ఇది అమలవు తుందో లేదో ఎవరికీ తెలియదు. కులగణన నుంచి దృష్టి మళ్లించే వ్యూహం ఇది' అని రాహుల్ గాంధీ విమర్శిం చారు. యూపీఏ హయాంలో రాజ్యసభలో ఆమోదం పొంది న మహిళా బిల్లులో ఓబీసీ కోటా లేదని విలేకరులు గుర్తు చేయగా అందుకు చింతిస్తున్నామని, అప్పుడే ఓబీసీల విషయం ఆలోచించామని, ఇప్పుడు కచ్చితంగా అది అమలు చేయాల్సిందేనని రాహుల్ చెప్పారు. ఓబీసీల నుంచి కేంద్ర ప్రభుత్వంలో ముగ్గురు మాత్రమే కార్యదర్శి స్థాయి అధికారులు ఉండటం ఆశ్చర్యపరిచిందని, అంతేకాకుండా ఓబీసీలకు కేవలం ఐదు శాతం మాత్రమే బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని తెలిపారు. ఓబీసీలు, దళితులు, గిరిజనులు అందరికీ కలిపి కేవలం ఆరుశాతం మాత్రమే బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు. ఇది తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. దేశంలో ఓబీసీలు ఎంతమంది ఉన్నారు...ఇతర కులాలు వారు ఎంతమంది ఉన్నార నేదే ప్రశ్న అని, అందుకే కులగణన చేపట్టాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు.

మహిళా కోటాను వాయిదా వేసేందుకే నియోజకవర్గాల పునర్విభ జన, జనాభా లెక్కలు వంటి కుంటిసాకులు చెబుతోందని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ఇప్పటికే విమర్శలు చేసింది. ఈ మొత్తం వ్యవహారాన్ని ఎన్నికల గిమ్మిక్కుగా అభి వర్ణిం చింది. ఇదిలా ఉండగా చరిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లు గురు వారం రాజ్యసభలో ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. అంతకు ముందు రోజు లోక్‌సభ లోనూ బిల్లుకు ఆమోదం లభించింది. 454 మంది ఎంపీలు అనుకూలంగా, ఇద్దరు వ్యతి రేకంగా ఓటేశారు. దాదాపు ఏకాభి ప్రాయంతో లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమో దించడం పార్ల మెంటరీ చరిత్రలో సువర్ణాధ్యాయమని ప్రధాని మోదీ అభివర్ణిం చారు. అన్ని పార్టీల నేతలు, సభ్యులు మద్దతుగా నిలిచి చరిత్ర సృష్టించారని హర్షం వ్యక్తం చేశారు.

భారత్ స్వాతంత్ర్యం ప్రశ్నార్థకం

- ప్రమాదంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం
- బీజేపీని గద్దె దించితేనే దేశాన్ని కాపాడుకోగలం
- పార్లమెంటులో సీపీఐ ఎంపీ సుబ్బరాయన్

న్యూదిల్లీ: భారత స్వాతంత్ర్యం ప్రశ్నార్థకంగా మారిందని, ప్రజా స్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో పడ్డాయని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఎంపీ సుబ్బరాయన్ అన్నారు. అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించితే తప్ప దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, స్వాతంత్ర్యాన్ని కాపాడుకోలేమని పార్లమెంటులో ఉద్ఘాటించారు. ఈ ప్రభుత్వాన్ని అధికారంలో కొనసాగనిస్తే విలువైన స్వాతంత్ర్యాన్ని మనం కోల్పోవల్సి వస్తుందని హెచ్చరించారు. బీజేపీ ప్రభుత్వానికి దేశమంటే ప్రేమ, పార్లమెంటరీ వ్యవస్థ, విధానాలపై గౌరవం లేదన్నారు. కేవలం ఆర్భాటాలకే మొగ్గుచూపుతుందని దుయ్యబట్టారు. జాతీయ ప్రయోజనా లను, పార్లమెంటరీ ప్రక్రియ పరిరక్షణను ప్రతిబింబించేలా... ప్రజాస్వామ్యా నికి, రాజ్యాంగానికి కట్టుబడేలా చర్యలు తీసుకోదన్నారు. జీ20 సమావేశాలు విజయవంతమైనట్లు అనేకమంది ఎంపీలు ప్రస్తావించారు కానీ ఎన్నడూ భారత ప్రయోజనాలను పరిరక్షించని అమెరికా, ఇజ్రా యిల్‌తో ఒప్పందాలపై ఎవ్వరూ మాట్లాడలేదని ఎంపీ అన్నారు. ప్రపంచ దేశాల్లో భారత్ ప్రతిష్ఠను పండిట్ నెహ్రూ పెంచగా నేడు అది దిగజారు తోందన్నారు. భారత్‌ను కాపాడుకోవాలంటే అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందేనని సుబ్బరాయన్ నొక్కిచెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, పార్లమెంటరీ పరిపాలన వ్యవస్థను పరిరక్షించడంలో ఈ ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజకీయ వ్యవస్థను పరిరక్షించడం ద్వారానే భారత్‌ను కాపాడుకోగలమని పార్లమెంటులో సుబ్బరాయన్ వక్కాణించారు.

బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలో దుర్భర పరిస్థితులకు భారత్ సజీవ సాక్షిగా నిలిచిందని విమర్శించారు. స్వాతంత్ర్య పోరాటంలో, జాతినిర్మాణంలో సీపీఐ ఎనలేని తోడ్పాటు అందించిందని గుర్తుచేశారు. అనేకమంది ప్రాణాలు త్యజించి సాధించిన స్వాతంత్ర్యం నేడు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దేశమంటే మనుషులన్న విషయాన్ని పాలకులు మరుస్తున్నారని, సరిహద్దులు, అటవీ ప్రాంతాన్ని, తారు రోడ్లను కాపాడుకుంటే సరిపోతుందని భావిస్తున్నారన్నారు. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలు, ప్రయోజనాలను ప్రతిబింబించేలా దేశంలో ఉండాలని చెప్పారు. తొమ్మిదేళ్లలో దుర్భర పరిస్థితులను భారత్ అనుభవించిందని, సమయం పరిమితం కాబట్టి 75ఏళ్ల అనుభవాలను కేవలం ఒకటి, రెండు నిమిషాల్లో వెల్లడించలేనని సుబ్బరాయన్ అన్నారు. ప్రణాళికాబద్ధంగా రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య పరిపాలనా వ్యవస్థ వినాశనానికి కసరత్తు జరుగుతోందన్నారు. ప్రజాస్వామ్యం పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన వారు దానికే ఎసరు పెట్టారని విమర్శించారు. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక వ్యవస్థలను అస్థిరపరుస్తున్నారన్నారు. భవనం మెట్లకు వంగి వంగి దండాలు పెట్టడం వల్ల పార్లమెంటు స్థాయి పెరగదని, పార్లమెంటు సమగ్రతను కాపాడటంలో ఈ ప్రభుత్వం విఫలమవుతోందని సుబ్బరాయన్ వ్యాఖ్యానించారు.

ఇచ్చినది 33శాతమే... 50 కాదు

- రాజ్యసభ, శాసనమండళ్లలో కోటా ఏది?
- ట్రాన్స్ మహిళలు, ఓబీసీల సంగతేమిటి?
- మహిళా బిల్లుపై ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ ప్రశ్నలు
- రిజర్వేషన్ల తక్షణ అమలుకు డిమాండ్

న్యూదిల్లీ: చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పిస్తూ మహిళా బిల్లును తీసుకు రావడం హర్షణీయమే కానీ రాజ్యసభలో, శాసనమండళ్లలో కోటా ప్రస్తావన లేకపోవడం నిరాశాజనకమని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) వ్యాఖ్యానించింది. 50శాతానికి బదులు 33శాతం రిజర్వేషన్ కల్పించినాగానీ మహిళా రిజర్వేషన్ బిల్లును స్వాగతిస్తున్నామని ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ అధ్యక్షురాలు అరుణా రాయ్, ప్రధాన కార్యదర్శి అనీరాజా ఓ ప్రకటన చేశారు. దీనిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, మహిళా బిల్లులో ట్రాన్స్-మహిళలు, ఓబీసీల గురించి, మూడు లేక అంతకంటే తక్కువ పార్లమెంటరీ నియోజకవర్గాలు ఉన్న రాష్ట్రాల్లో మహిళలకు రిజర్వేషన్ గురించి ఏమీ లేదన్నారు. దేశ రాజధాని దిల్లీ గురించి స్పష్టంగా ఉన్నా మిగతా కేంద్ర పాలిత ప్రాంతాల ప్రస్తావన లేకపోవడం గమనార్హమన్నారు. మహిళలకు రాజకీయ సాధికారత కోసం పాటు పడిన గీతా ముఖర్జీ వంటి సీనియర్లకు, మహిళా బిల్లు ఆమోదానికి ఉద్యమించిన మహిళలు, మహిళా సంఘాలు, ప్రజాస్వామిక శక్తులకు ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ సెల్యూట్ చేస్తుందన్నారు. పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టే విధంగా మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంటు ఆమోదం లభించినా ఈ బిల్లు అమలుకు కాలపరిమితి లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. జనగణన, పునర్విభజన ప్రక్రియ తర్వాతే రిజర్వేషన్లు కల్పిస్తామని మెలిక పెట్టడం ద్వారా 2029కి ముందు వీటి అమలు జరగదు... అంటే దీనిని అమలు చేసే యోచన బీజేపీ ప్రభుత్వానికి లేదని స్పష్టమవుతోందని నేతలు వ్యాఖ్యానించారు. 2029 లోగా అనేక రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి కాబట్టి మహిళలపై ప్రభావం తీవ్రంగా ఉంటుందన్నారు. మహిళల కోసమంటూ కేంద్రప్రభుత్వం ఏమైనా బిల్లు తెచ్చినదంటే దాని ప్రభావం ప్రతికూలంగా ఉంటుందని వారు వ్యాఖ్యానించారు.'ట్రిపుల్ తలాఖ్‌ను శిక్షార్హమైన నేరంగా మార్చి సాక్ష్యాలు లేకుండా అనేక మంది పురుషుల అరెస్టుకు దారితీసిన క్రమంలో కుటుంబాలపై ప్రతికూల ప్రభావం పడిందన్నారు. కుటుంబాన్ని పోషించే ఏకైక వ్యక్తి కటకటాల పాలైతే మహిళలు, పిల్లల పరిస్థితి ఏమిటి?' అని నాయకులు ప్రశ్నించారు. మహిళలకు రాజకీయ సమానత్వం కల్పించడం బీజేపీ ప్రభుత్వానికి ఇష్టం లేదని అందులో రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయకుండా సాకులు చెబుతోందని అరుణా రాయ్, అనీ రాజా విమర్శించారు. ఈ బిల్లును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

స్కిల్ డెవలప్‌మెంట్ స్కీం పెద్ద స్కామ్

చంద్రబాబే ప్రధాన సూత్రధారి

అసెంబ్లీలో చర్చలో మంత్రి బుగ్గన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ స్కీం వల్ల జరిగిన ఉపయోగం ఏమీ లేదని, అదొక పెద్ద స్కామ్ అని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అన్నారు. శాసనసభలో ఈ అంశంపై శుక్రవారం లఘు చర్చ జరిగింది. ఈ సందర్భంగా బుగ్గన ఈ స్కీం పూర్వాపరాలు మొత్తాన్ని సభకు వివరించారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలలకే చంద్రబాబు ఈ స్కీంకు తెరతీశారని, దీనిలో ఆనాటి ప్రభుత్వం ఎంవోయూ చేసుకున్న డిజైన్ టెక్ అనేది ఒక డొల్ల కంపెనీ అని తెలిపారు. అసలు ఆ కంపెనీతో ఒక తేదీ లేకుండా ఒప్పందం చేసుకోవడమే విచిత్రమన్నారు. 2015-16లో ఈ స్కీం కింద మొత్తం రూ.371 కోట్లు రిలీజ్ చేశారు. దీని నిర్వహణ కోసం కీలక పదవుల్లో చంద్రబాబు సన్నిహితుడైన గంటా సుబ్బారావు అనే ఒక ప్రైవేటు వ్యక్తిని నియమించారు. సీమెన్స్ కంపెనీ మిగిలిన రాష్ట్రాల్లో కూడా ఈ ప్రాజెక్టు నిర్వహించిందని కట్టుకథ అల్లారు. కాని ఆ కంపెనీ తమకు అసలు సంబంధమే లేదని తెలిపింది. మనకు ఇంటర్‌నెట్‌లో స్కిల్ అంశాలకు సంబంధించి అన్ని విషయాలు కూడా ఉచితంగా లభ్యమవుతుండగా, 90 శాతం ఖర్చు అంటే దాదాపు రూ.3 వేల కోట్లు భరించడానికి సీమెన్స్ కంపెనీ ముందుకు వచ్చిందని, 10 శాతం ప్రభుత్వం భరిస్తే సరిపోతుందని చెప్పి రూ.371 కోట్లు స్వాహా చేశారు. ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేసేటప్పుడు ఏ ప్రభుత్వమైనా టెండర్లు ఆహ్వానించాల్సి ఉంటుందన్నారు. కాని చంద్రబాబు కనీస నిబంధనలు పాటించకుండా డొల్ల కంపెనీలతో పెద్దమొత్తంలో డబ్బు స్వాహా చేశారని విమర్శించారు. అదే గుజరాత్‌లో కేవలం రూ.12 కోట్లతోనే సీమెన్స్ కంపెనీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు నిర్వహించిందన్నారు. కేవలం ప్రభుత్వ నిధులను కైంకర్యం చేయడం కోసమే సీమెన్స్ కంపెనీని చంద్రబాబు వాడుకున్నారని, ఈ మొత్తం స్కాం వ్యవహారంలో చంద్రబాబే ప్రధాన సూత్రధారి అన్నారు. దర్యాప్తు సంస్థలు ఆధారాలన్నీ సేకరించాయన్నారు. ప్రభుత్వం వద్ద అన్ని ఆధారాలున్నాయని, దోషులను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు అడ్డంగా దొరికిపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచక టీడీపీ శ్రేణులు తప్పుడు కేసు బనాయించినట్లు ఆరోపణలు చేస్తున్నారని, అయితే వాస్తవం వారికి కూడా తెలుసునంటూ ఎద్దేవా చేశారు. ఈ స్కాంతో పాటు చంద్రబాబు ఇంకా అనేక స్కీంల్లో నిధులు దోచేశారని, త్వరలో అవి కూడా బయటపడతాయని హెచ్చరించారు.

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల షెడ్యూల్

విశాలాంధ్ర బ్యూరో- బాపట్ల: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ మహాసభలు ఈ నెల 25, 26, 27 తేదీల్లో మూడు రోజుల పాటు బాపట్లలో జరగనున్నాయి. మహాసభ కార్యక్రమాలు కింది విధంగా ఉన్నాయని సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జల్లి విల్సన్, ఆవుల శేఖర్ వెల్లడించారు.

25వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు బాపట్ల - గుంటూరు రోడ్డులోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి సాగుభూములు, ఉపాధి, సామాజిక న్యాయం సాధన నినాదంతో కూలిదండు మహాప్రదర్శన ప్రారంభం.

- బాపట్ల రథంబజార్ సెంటర్లో ప్రప్రథమ బాపట్ల కమ్యూనిస్టు ఎమ్మెల్యే అమరులు వేములపల్లి శ్రీకృష్ణ బహిరంగ సభాప్రాంగణంలో అమృతలూరు ప్రప్రథమ కమ్యూనిస్టు ఎమ్మెల్యే అమరులు గొరికపూడి జోసఫ్ సభావేదిక వద్ద బహిరంగసభ జరుగుతుంది. ప్రజానాట్యమండలి కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.
- 26వ తేదీ మంగళవారం ఉదయం 9.30 గంటలకు అమరులు జేఎస్ఆర్ ఆంజనేయశాస్త్రి భోజనశాలలో టీ, టిఫిన్, మొదటి తరం ఎమ్మెల్యే అమరులు గుజ్జుల యల్లమందారెడ్డి మహాసభ ప్రాంగణంలోని (అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కల్యాణమండపం) తొలితరం పార్లమెంటు సభ్యులు అమరులు కోండ్రు సుబ్బారావు హాల్‌లో ప్రతినిధుల సభ.
- వ్యవసాయ కార్మిక సంఘం నేత పాముల భీమలింగప్పచే అరుణ పతాకం ఆవిష్కరణ
- మృతవీరులకు శ్రద్ధాంజలి అమరుల సంతతి భావిరెడ్డి ప్రభాకర్,
- ఫోటో ఎగ్జిబిషన్ ప్రారంభకులు వ్యవసాయ కార్మిక సంఘం నేత సిహెచ్ కోటేశ్వరరావు
- అధ్యక్షవర్గం, సారథ్య సంఘం, అర్హతల కమిటీ, తీర్మానాల కమిటీ ఎన్నిక, సంతాప తీర్మానం, ఆహ్వాన సంఘం అధ్యక్షులు జేబీ శ్రీధర్ స్వాగతోపన్యాసం
- మహాసభ ప్రారంభకులు: భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ ప్రధాన కార్యదర్శి గుల్జార్ సింగ్ గోరియా
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, వ్యవసాయ కార్మిక, ప్రజాసంఘాల నేతల సందేశాలు, అనంతరం భోజన విరామం
- సాయంత్రం 4 గంటలకు ప్రతినిధుల సభ - రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నివేదిక
- సాయంత్రం 5-30 గంటలకు సెమినార్. అంశం : అమృతకాలంలో గ్రామీణ పేదలు-సంక్షేమం-అభివృద్ధి-భవిష్యత్ కర్తవ్యం !
- అధ్యక్షులు : మాజీ ఎమ్మెల్సీ, ఏఐటీయూసీ రాష్ట్ర నేతపీజే చంద్రశేఖరరావు
- వక్తలు సి. నరసింహారావు, విశ్రాంత ఆచార్యులు, నాగార్జున యూనివర్శిటీ
- దాక్టర్ కె. సోమశేఖర్ గ్రామీణాభివృద్ధి శాఖ, నాగార్జున యూనివర్శిటీ
- 27వ తేదీ బుధవారం ఉదయం 9-30 గంటలకు ప్రతినిధుల సభ
- కార్యదర్శి నివేదికపై ప్రతినిధుల చర్చలు, వివిధ అంశాలపై తీర్మానాలు తదితరాలు.
- మధ్యాహ్నం 3 గంటలకు చర్చలకు సమాధానం, కార్యదర్శి నివేదిక ఆమోదం
- నూతన జనరల్ కౌన్సిల్ ఎన్నిక, ఆఫీస్ బేరర్లు, కార్యవర్గం ఎన్నిక, పరిచయం, వందన సమర్పణ

మిర్వాయిజ్‌పై 'అక్రమ' గృహ నిర్బంధం ఎత్తివేత

శ్రీనగర్ : వేర్పాటువాద సంస్థ హురియత్ కాన్ఫరెన్స్ చైర్మన్ మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్ శు క్రవారం అక్రమ గృహ నిర్బంధం నుంచి విడుదలయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం తర్వాత శ్రీనగర్‌లోని జామియా మసీదులో మిర్వాయిజ్ మొదటి ప్రసంగంపై అందరి దృష్టి ఉంది. మిర్వాయిజ్ ఆగస్టు 5, 2019న భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని రద్దు చేసినప్పటి నుంచి గృహ నిర్బంధంలో ఉన్నారు.

కశ్మీర్ గ్రాండ్ మసీదు, జామియా మసీదు నిర్వహణ కమిటీ ప్రకారం, మిర్వాయిజ్ చారిత్రాత్మకమైన శుక్రవారం సమ్మేళనం ప్రార్థనలలో పాల్గొంటారు. 'అధికారులు అతనిని గృహనిర్బంధం నుంచి విడుదల చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ రోజు శుక్రవారం ప్రార్థనల కోసం జామియా మసీదుకు వెళ్లేందుకు అనుమతించారని తెలియజేసేందుకు సీనియర్ అధికారులు నిన్న మిర్వాయిజ్ నివాసాన్ని సందర్శించారు' అని అంజుమాన్ ఔకాఫ్ జామియా మసీదు (ఏఏజేఎం) అధికారి ఒకరు తెలిపారు. మిర్వాయిజ్‌పై విధించిన ఆంక్షలు ఎత్తివేశారని, సెప్టెంబరు 22 శుక్రవారం జామియా మసీదులో ప్రార్థనలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వడం జరిగిందని జమ్ముకశ్మీర్ పోలీసు ఉన్నతాధికారి ఒకరు 'ది వైర్' కి ధ్రువీకరించారు. కాగా, మిర్వాయిజ్ విడుదలను జమ్ముకశ్మీర్‌లోని రాజకీయ పార్టీలు స్వాగతించాయి. 'మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్‌ను గృహ నిర్బంధం నుంచి విడుదల చేయడానికి జమ్ముకశ్మీర్ పరిపాలన యంత్రాంగం తీసుకున్న చర్యను నేను స్వాగతిస్తున్నాను.

అతను స్వేచ్ఛగా తిరగడానికి, ప్రజలతో సంభాషించడానికి, అతను సామాజిక, మతపరమైన బాధ్యతలను తిరిగి కొనసాగించడానికి వారు అనుమతిస్తారని నేను ఆశిస్తున్నాను. 2019 నుంచి జామియా మసీదులో తన మొదటి శుక్రవారం ఉపన్యాసం చేస్తున్నందున ఈ రోజు కశ్మీర్‌లోని కళ్లు మిర్వాయిజ్‌పైనే ఉంటాయి' అని జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షురాలు, మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ 'చివరికి, మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్ తన నిర్బంధాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ పరిపాలన ఎత్తివేసిన సంవత్సరాల తర్వాత స్వేచ్ఛగా నడుచుకుంటాడు. మత నాయకుడిగా, అతను జమ్ముకశ్మీర్ అంతటా ముస్లింలచే గౌరవం పొందాడు' అని అన్నారు. అప్నీ పార్టీ నాయకుడు అల్తాఫ్ బుఖారీ గత కొన్ని వారాలుగా మిర్వాయిజ్‌ను విడుదల చేస్తారని, అతను తర్వాత ప్రార్థనలు చేస్తారని చెబుతూ వచ్చారు.

మా నేతలను ఇరికించాలని ఈడీ చూస్తోంది

కరూవన్నూర్ కుంభకోణంపై సీపీఎం

తిరువంతపురం: కరూవన్నూర్ బ్యాంకు కుంభకోణంలో తమ సీనియర్ నాయకులను ఇరికించేందుకు సాక్షులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ బెదిరిస్తోందని సీపీఎం కేరళ కార్యదర్శి ఎంవీ గోవిందన్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని సహకార రంగాన్ని నాశనం చేసేందుకు ఈడీ యత్నిస్తోందని, సీపీఎం సీనియర్ల పేర్లు చెప్పాలంటే సాక్షులను బెదిరించడం, వేధించడం అప్రజాస్వామికమని వ్యాఖ్యానించారు. సీపీఎం పార్టీ సీనియర్ నేతల పేర్లను చెప్పాలంటూ ఈడీ అధికారులు తనను బలవంతపెట్టారని, బెదిరించారని, వేధించారని మీడియా ముందు ఓ సాక్షి చెప్పడంతో ఆ పార్టీ నేతలు ఘాటుగా స్పందించారు. కుమార్తె పెళ్లి ఆపేస్తామంటూ ఓ సాక్షిని అధికారులు బెదిరించినట్లు గోవిందన్ చెప్పారు. సహకార రంగాన్ని పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని, బ్యాంకు కుంభకోణం కేసులో రాష్ట్ర పోలీసులు శీఘ్రమే స్పందించి తగు చర్యలు తీసుకున్నారని తెలిపారు. పోలీసు విచారణ అనంతరం ఈడీ వచ్చి లెఫ్ట్ నేతలను లక్ష్యంగా చేసుకుంటోందన్నారు. పార్టీ సీనియర్ నేత ఏసీ మొయిదీన్ ఇంటిని సోదా చేసి, ఆయను విచారించినట్లు గోవిందన్ చెప్పారు. ఈ కుంభకోణం నేపథ్యంలో ఆ బ్యాంకు ఖాతాదారులకు రూ.100 కోట్లకుపైగా తిరిగిచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

భారత్ బోణీ

గైక్వాడ్, గిల్, సూర్య, రాహుల్ అర్ధ సెంచరీలు

ఐదు వికెట్లు తీసిన షమీ

మొహాలీ: ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో భారత్ బోణీ కొట్టింది. మొహాలీ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో భారత్ విజయం సాధించింది. 48.2 ఓవర్లకు ఐదు వికెట్లు కోల్పోయి 281 పరుగులు చేసి భారత్ గెలుపొందింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యతలో నిలిచింది. 277 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమ్‌ఇండియా.. ప్రారంభం నుంచి నిలకడగా ఆడింది. ఓపెనర్లు రుతురాజ్ గైక్వాడ్ (71), గిల్ (74) అర్ధశతకాలతో శుభారంభాన్ని అందిచ్చారు. శ్రేయస్ (3) కాస్త నిరాశ పరిచిప్పటికీ... తర్వాత క్రీజులోకి వచ్చిన రాహుల్ (58), సూర్యకుమార్ (50) కీలక ఇన్నింగ్స్ ఆడటంతో మరో 8 బంతులు మిగిలుండగానే విజయం భారత్ వశమైంది. ఆసీస్ బౌలర్లలో జంపా 2 వికెట్లు తీయగా, కమిన్స్, అబాట్ చెరో వికెట్ పడగొట్టారు. అంతకుముందు ఆస్ట్రేలియా 276 పరుగులకు ఆలౌటయ్యింది. టాస్ గెలిచిన భారత్...ఆస్ట్రేలియాను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 50 ఓవర్లకు 276 పరుగులకు ఆలౌట్ అయింది. ఓపెనర్ మిచెల్ మార్ష్ వికెట్‌ను షమీ ఆరంభంలోనే కూల్చాడు. తర్వాత డేవిడ్ వార్నర్(51)తో కలిసిన స్టీవ్ స్మిత్(41) ఇన్నింగ్స్‌ను నిదానంగా ప్రారంభించారు. స్మిత్ ఆచితూచి ఆడుగా వార్నర్ వేగం పెంచాడు. కుదురుకుంటున్న దశలో వార్నర్‌ను రవీంద్ర జడేజా, స్మిత్‌ను షమీ పెవిలియన్‌కు పంపారు. తర్వాత లబుచేంజ్(39), ఇంగ్లిస్(45)కు అవుటయ్యారు. తర్వాత వచ్చిన బ్యాటర్లు స్టొయినిస్(29), కమిన్స్ (21)తో ఆదుకున్నారు. భారత్ బౌలర్లలో షమీ ఐదు వికెట్లు తీసుకోగా బుమ్రా, జడేజా, అశ్విన్ తలో వికెట్ పడగొట్టారు.

మహిళా బిల్లు తక్షణ అమలు సముచితం

వేర్వేరు రంగాల మహిళా ప్రతినిధులు

న్యూదిల్లీ: చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించే నారీశక్తి వందన్ అధినియం బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. ఇక రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే అది చట్టరూపం దాల్చుతుంది. అయితే ఈ బిల్లు ప్రకారం మహిళలకు రిజర్వేషన్లు ఎప్పటికి అమలు జరుగుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. రిజర్వేషన్ల అమలుపై అనిశ్చితి నెలకొంది. అయితే మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఈ బిల్లు ద్వారా లింగ సమానత్వం సాధ్యమన్న ఆశాభావం ఉంది. మహిళా బిల్లు గొప్పదేగానీ దీనిని అమలు చేసే ఉద్దేశం కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి లేదని విపక్షాలు అంటున్నాయి. కేవలం ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా వాడుకునే ఉద్దేశంతోనే దీనిని ప్రవేశపెట్టిందని విమర్శిస్తున్నాయి. ఈ బిల్లును ఎన్నికల జిమ్మిక్కుగా వర్ణిస్తున్నాయి. 2024 ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలునకు డిమాండ్ చేస్తున్నాయి. కానీ జనగణన, నియోజకవర్గాల పునర్విభజన పూర్తి అయితే తప్ప మహిళలకు రిజర్వేషన్లను కల్పించేందుకు వీలు కాదని కేంద్రం వాదిస్తోంది. ఇదే అంశంపై ప్రముఖ న్యాయవాది శిల్పిజైన్ స్పందిస్తూ 33శాతం మంది మహిళలకు టికెట్లు ఇస్తే సరిపోతుంది కదా... ఈ బిల్లు అమలులో తాత్సారం ఎందుకని ప్రశ్నించారు. అమలు ఉద్దేశం లేకుండా మహిళా బిల్లును తీసుకు రావడం కంటితుడుపు చర్యగా తోస్తోం దన్నారు. అమల్లోకి వస్తే తప్ప దానికి విలువ ఉండదని, అంది.. అందని బహుమతిగా ఈ బిల్లు ఉందని శిల్పిజైన్ వ్యాఖ్యానిం చారు. ఎన్జీవో అన్హద్ ప్రతినిధి షబానా హాష్మీ కూడా జైన్ తరహా ఆలోచనలే వ్యక్తంచేశారు. 'ముందు జనగణన ఆపై పునర్విభజన జరగాలి అంటే 2029 నాటికి కూడా రిజర్వేషన్లు అమలు జరుగుతాయన్న హామీ లేదు' అని ఆమె అన్నారు. ఎంపీలుగా, ఎమ్మెల్యేలు మహిళలు రాణిస్తే మార్పు అనివార్యవన్నారు. స్వీయసమృద్ధిగా మహిళలు తయారు కాగలరని ఆకాంక్షించారు. అయితే రాజకీయ నేపథ్యం లేని కుటుంబాల వారు కూడా ఎన్నికల్లో పోటీ చేసేలా నిబంధనలు ఉంటే బాగుంటున్న అభిప్రాయాన్ని ఇంకొందరు మహిళలు వ్యక్తంచేశారు. రానున్న కాలంలో మహిళల సాధికారతకు మహిళా బిల్లు ఎంతగానో దోహదమవుతుందని 'సర్పంచ్ పతీస్' (గ్రామ మండలి పెద్దగా ఎన్నికైన మహిళ భర్త) వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతున్న బీహార్, గయా సర్పంచ్ డాలీ వర్మ అన్నారు. ట్రాన్స్‌ఫార్మ్ రూరల్ ఇండియా నాయకులు సీమా భాస్కరన్ మాట్లాడుతూ లింగ వ్యత్యాసాన్ని తగ్గించేందుకు మహిళా బిల్లు దోహదమవుతుందని చెప్పారు. 'కేరళ వంటి రాష్ట్రాల్లో ఎన్నికైన మహిళా ప్రతినిధుల స్ఫూర్తితో గ్రామ సభల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం అందరికీ తెలుసు. ఆర్థికాభివృద్ధి ప్రాజెక్టుల్లో వ్యూహాత్మక ప్రయోజనాలు కావాలన్నా, మహిళల పని భాగస్వామ్య స్థాయి పెరగాలన్న రిజర్వేషన్లు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటాయ'ని ఆమె అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.